www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
గురువారం | 16 | ఏప్రిల్ | 2026 పేజీలు : 8

## ఆదివాసీల ఆత్మ గౌరవ ప్రతీక కొమరం భీమ్



**- జల్ జంగిల్ జమీన్ నినాదం అజరామరం**

**ప్రజాపక్షం/పాల్వంచ :** విప్లవ వీరుడు కొమరం భీమ్ ఆదివాసీల ఆత్మగౌరవానికి ప్రతీక అని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా అన్నారు. మండల పరిధి

మిగతా 2లో..

# పులిగుండాలను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తాం



**-డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క**
**-పులిగుండాల ప్రాజెక్ట్ పరిసరాల్లో కాటేజీల నిర్మాణానికి 4 కోట్లు మంజూరు**

**ప్రజాపక్షం/పెనుబల్లి:** పెనుబల్లి మండలం బ్రాహ్మళ్ళ కుంట గ్రామంలోని పులిగుండాల ట్యాంక్ వద్ద ఏర్పాటు చేసిన పులిగుండాల ప్రాజెక్ట్‌ను దేశంలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. డిప్యూటీ సీఎం బుధవారం, రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, పిసిసిఎఫ్ సువర్ణ, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సిపి సునీల్ దత్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ భీమా నాయక్, జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ విక్రమ్ సింగ్ లతో కలిసి పులిగుండాల ఎకో టూరిజం ప్రాజెక్ట్‌ను ప్రారంభించి పరిశీలించారు.

మిగతా 2లో..

# విద్య, వైద్య రంగాల్లో ప్రజలకు మెరుగైన సేవలు



**-డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క**
**-సత్తుపల్లి నియోజకవర్గంలో ఒకేరోజు మూడు ఆసుపత్రులు ప్రారంభం**

**ప్రజాపక్షం/సత్తుపల్లి :** విద్య, వైద్య రంగాలలో భారీ పెట్టుబడులతో ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. డిప్యూటీ సి.ఎం. మల్లు భట్టి విక్రమార్క బుధవారం రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ లతో కలిసి సత్తుపల్లిలో రూ. 34 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించిన వైద్య విధాన పరిషత్ 100 పడకల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో డిప్యూటీ సి.ఎం. మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ సత్తుపల్లి పట్టణంలో వంద పడకల ఆసుపత్రిని ప్రారంభించడంతో పాటు నేడు ఇదే నియోజకవర్గంలో ఒక 50 పడకల ఆసుపత్రి, మరో 30 పడకల ఆసుపత్రి ప్రారంభోత్సవం, విద్యుత్ శాఖకు సంబంధించి పలు విద్యుత్ ఉప కేంద్రాల నిర్మాణ పనులకు శంకుస్థాపన, ఎకో టూరిజం ప్రాంతాన్ని పరిశీలన చేయడం జరిగిందని అన్నారు.

మిగతా 2లో..

# దర్జాగా రేషన్ దందా ..!

**- బహిరంగంగానే రేషన్ బియ్యం అక్రమ విక్రయాలు**
**- లబ్ధిదారుల నుండి సేకరిస్తున్న వ్యాపారులు**
**- రీసైక్లింగ్ చేస్తూ పక్క రాష్ట్రాలకు సరఫరా**
**- పక్కదారి పడుతున్న పేదల బియ్యం**
**- దాడులు చేస్తున్నా ఆగని దందా**





**జిల్లాలో పిడిఎస్ అక్రమ దందా దర్జాగా సాగుతోంది.** లబ్ధిదారుల నుండి బహిరంగంగానే రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తూ పలువురు అక్రమార్కులు లక్షల గడిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఆ బియ్యాన్ని రీ సైక్లింగ్ చేస్తూ పొరుగు రాష్ట్రాల్లో అధిక ధరలకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ దందాపై అధికారులు నిఘా పెట్టినా దందా ఆగడం లేదంటే అతిశయోక్తి కాదు.

-ప్రజాపక్షం/కొత్తగూడెం

2లో

# రోడ్డు ప్రమాదంలో కాంగ్రెస్ నేత జావిద్ మృతి

**-మంత్రులు భట్టి, తుమ్మల, పొంగులేటి సంతాపం**
**-కాంగ్రెస్‌లో తీవ్ర విషాదం**

2లో..





# రోడ్డు ప్రమాదంలో సిపిఐ నేత మృతి





**-నివాళులర్పించిన బాగం, దండి తదితరులు**
**-తల్లాడలో విషాదం**

2లో

# పులిగుండాలను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తాం

(మొదటిపేజీ తరువాయి)



ఈ సందర్భంగా బోటింగ్, వాటర్ ఫాల్స్, జంగిల్ సఫారీ లను ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సి.ఎం. మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఈ అందమైన ప్రదేశాన్ని పరిచయం చేసిన స్థానిక ఎమ్మెల్యే, డి.ఎఫ్.ఓ. లకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎకో టూరిజం అభివృద్ధిని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటోందని, తెలంగాణలోని ప్రకృతి సౌందర్యాలను ప్రపంచానికి పరిచయం చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. కనకగిరి హిల్స్ అభివృద్ధిని తక్షణమే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పులిగుండాల ప్రాజెక్ట్ నీటి పరిసర ప్రాంతాల్లో రెండు వైపులా కాటేజీల నిర్మాణానికి 4 కోట్లు సిఎస్ఆర్ నిధుల నుండి మంజూరు చేయనున్నట్లు తెలిపారు. పనుల అమలుకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను వెంటనే సిద్ధం చేసి, పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయి, ఎప్పుడు పూర్తవుతాయి అనే కాలపట్టికను సిద్ధంగా ఉంచాలని అధికారులకు సూచించారు. పర్యాటకులు ఈ ప్రాంతానికి సులభంగా చేరుకునే విధంగా డబుల్ రోడ్డు నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు వెంటనే పంపించాలని ఆదేశించారు. ఈ ప్రాంతంలో ఎకో టూరిజాన్ని అభివృద్ధి చేస్తే స్థానిక ప్రజలకు విస్తృత స్థాయిలో ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పర్యాటక రంగాన్ని విస్తృతంగా ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. భవిష్యత్తులో పులిగుండాల ప్రాజెక్టును దేశంలోని ప్రముఖ పర్యాటక కేంద్రాలలో ఒకటిగా అభివృద్ధి చేస్తామని డిప్యూటీ సీఎం తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ..కనకగిరి హిల్స్ వంటి అందమైన ప్రాంతాలను సందర్శించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసి రాష్ట్రానికి ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎకో టూరిజం క్రింద రాష్ట్రంలో టాప్ 3 గమ్యస్థానాలలో ఒకటిగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని అన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి అవసరమైన పూర్తి కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని, అన్ని విధాల అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ.. పులిగుండాల ఎకో టూరిజం ప్రాజెక్ట్ ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు లభించడమే కాకుండా, మన సంస్కృతి, వారసత్వాన్ని ప్రపంచానికి పరిచయం చేసే అవకాశం కలుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్య, వైద్య రంగాల్లో ప్రజలకు మెరుగైన సేవలు





(మొదటిపేజీ తరువాయి) నేడు ప్రారంభమైన ఆస్పత్రులు ప్రజల పట్ల ప్రజా ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం అని డిప్యూటీ సీఎం తెలిపారు. విద్య, వైద్య రంగాలపై అధికంగా పెట్టుబడి పెడుతూ ప్రజలకు మెరుగైన వసతులు కల్పిస్తున్నామని అన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించేందుకు 14 వేల అదనపు పడకలు అందుబాటులోకి తీసుకొని వచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి ఆహార కొరత లేకుండా కోటి ఆరు లక్షల కుటుంబాలకు సన్న బియ్యం ప్రతినెలా సరఫరా చేస్తున్నామని అన్నారు. ఖమ్మం జిల్లా వ్యవసాయ ఆధారితమైన జిల్లా అని, ఇక్కడ రైతుల కోసం గత కాంగ్రెస్ హయాంలో నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మించి ఆయకట్టు తీసుకొని వచ్చామని, నేడు మన ఇందిరమ్మ ప్రభుత్వం పెద్ద ఎత్తున నీటి వసతి కల్పించడం కోసం అనేక ప్రాజెక్టులు చేపట్టిందని, ప్రస్తుతం జిల్లాలో 3,40,000 ఎకరాలకు ఆయకట్టు ఉంటే, అదనంగా మరో 3 లక్షల 16 వేల ఎకరాలకు పైగా ఆయకట్టు నీరు అందించేందుకు ప్రభుత్వం రూ. 2500 కోట్లు విడుదల చేశామని అన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి పేదవాడికి వైద్యానికి, విద్యకు ఎటువంటి లోటు రాకూడదనీ, ధనికులకు ఎటువంటి వైద్యం, విద్య అందుతున్నాయో, అటువంటి విద్య, వైద్యం పేదలకు అందాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సహకరించక పోయినా పేదవాడే ప్రభుత్వానికి లోకమని భావించి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందని అన్నారు. వందల కోట్లు ఖర్చు చేసి ఆసుపత్రుల నిర్మాణాలను పూర్తి చేస్తున్నామని, కల్లూరు లో 50 పడకలు, పెనుబల్లి 30 పడకలు, సత్తుపల్లి లో 100 పడకల ఆసుపత్రులు నేడు ప్రారంభిస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా వైద్యుల కొరత తగ్గించేందుకు వెంటనే అవసరమైన నియామక ప్రక్రియ చేపట్టాలని ఆదేశాలు జారీ చేసినట్లు మంత్రి తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 200 కోట్లు ఖర్చు చేస్తూ దాదాపు 25 ఎకరాల విస్తీర్ణంలో 2500 మంది వివిధ వర్గాలకు చెందిన విద్యార్థులకు ఉపయోగపడే విధంగా ఇండియా సమీకృత గురుకులాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. యంగ్ ఇండియా సమీకృత గురుకులాలతో పాటు, ప్రత్యేకంగా తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు చేశామని ఈ పనులు కూడా త్వరలోనే ప్రారంభం అవుతాయని అన్నారు. గత ప్రభుత్వాలు చేసిన మంచి కార్యక్రమాలను కొనసాగిస్తూనే అదనంగా సన్న బియ్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, నూతన రేషన్ కార్డులు జారీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం వంటి అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు. అర్హులైన చివరి లబ్ధిదారుడి వరకు రాజకీయాలకతీతంగా తప్పనిసరిగా ఇందిరమ్మ ఇండ్లను తమ ప్రభుత్వం కేటాయిస్తుందని మంత్రి పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ రామారావు, డిసిహెచ్ఎస్ రాజశేఖర్ గౌడ్, తహశీల్దార్, ఎంపీడీఓ, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# దర్జాగా రేషన్ దందా ..!

**ప్రజాపక్షం/ కొత్తగూడెం :** జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ విక్రయాలపై నిఘా ఉన్నా... దందా ఆగడం లేదు. కొందరు వ్యాపారులు లబ్ధిదారుల నుండి తక్కువ ధరలకు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేయడంతో పాటు పలు రేషన్ షాపుల నుండి నేరుగా బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల రేషన్ బియ్యాన్ని తరలించేందుకు సిద్ధంగా ఉన్న లారీ లోడుతో పాటు మొత్తంగా 450 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అధికారులు పట్టుకున్నారు. గత శనివారం తెల్లవారుఝామున ఇల్లెందు మండలంలోని కోటమైసమ్మ గుడి సమీపంలో లారీలో ఎక్కిస్తున్న సుమారు 200 క్వింటాళ్ల రేషన్ బియ్యం, మండలంలో 250 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ బియ్యాన్ని అక్రమంగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి తరలిస్తున్నట్లు తేలింది. జిల్లాలో తెలిసి పట్టుబడిన బియ్యం ఇంత పెద్ద మొత్తంలో ఉండగా, గుట్టుచప్పుడు కాకుండా తరలిపోయే బియ్యం వందల క్వింటాళ్లలో ఉంటుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**పక్కదారి :** జిల్లాలో రేషన్ షాపుల ద్వారా పౌర సరఫరాల శాఖ ప్రతీ నెల 2,57,252 రేషన్ కార్డులకు గానూ 4800 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పంపిణీ చేస్తారు. ఇందులో 30 నుండి 40 శాతం బియ్యం పక్కదారి పడుతున్నట్లు తెలుస్తోంది. సేకరించిన బియ్యాన్ని ఇక్కడ రీసైక్లింగ్ చేయకుండా పొరుగు రాష్ట్రాలైన ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, ఒడిస్సాలకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది.

**తినేవారు తక్కువే :** జిల్లాలో చాలా మంది లబ్ధిదారులు ప్రభుత్వం ద్వారా అందిస్తున్న ఉచిత రేషన్ సన్నబియ్యాన్ని తినేందుకు మక్కువ చూపట్లేదు. బియ్యంలో నూకలు, తెల్లని రాళ్లు వస్తున్నాయనే సాకుతో ఆ బియ్యాన్ని కిలో రూ.12 నుండి రూ.15 వరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. కొందరు వ్యాపారులు పట్టణాలతో పాటు పల్లెల్లో ఇంటింటికీ తిరుగుతూ కొనుగోలు చేస్తున్నారు. మధ్య దళారులు వీరి వద్ద నుండి రూ.25 నుండి రూ.30 చెల్లించి కొంటున్నారు. ఇలా సేకరించిన మొత్తం బియ్యాన్ని పొరుగు రాష్ట్రాలకు తరలించి కిలో రూ.55 నుండి రూ.65 వరకు అమ్ముతూ లక్షలాది రూపాయలను అప్పనంగా సొమ్ము చేసుకుంటున్నారు. రేషన్ షాపుల్లో ఉచితంగా లభించే సన్నబియ్యాన్ని దళారులు అతి తక్కువ ధరలకు దక్కించుకుని అధిక మొత్తాల్లో విక్రయిస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 30 శాతం కార్డుదారులు ఇలాంటి విక్రయాలకు పాల్పడుతూ ప్రభుత్వ ఆశయాన్ని నీరుగారుస్తున్నారు. అర్హత లేకున్నా జిల్లాలో 7231 రేషన్ కార్డులు అక్రమంగా ఉన్నాయని గుర్తించిన అధికారులు వాటిని తొలగించి సమస్యకు తెరదించేందుకు చర్యలకు పూనుకున్నారు.

**ఆగని దందా :** దాడులు చేస్తున్నా ఏళ్ల తరబడి రేషన్ బియ్యం దందా ఆగడం లేదు. దీంట్లో క్రింది స్థాయి నుండి మొదలుకుని పై స్థాయి వరకు అందరి హస్తాలు ఉన్నట్లు పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. రేషన్ బియ్యాన్ని షాపుల వద్దే విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్న వారిపై అధికారులు పూర్తి నిఘా పెట్టాలని పలువురు అంటున్నారు. షాపుల ముందు సిసి కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా పటిష్టం చేయాలంటున్నారు. రేషన్ బియ్యం అక్రమ వ్యాపారులను పట్టుకుని జరిమానాలతోనే సరిపెడుతున్నారు తప్ప కఠిన చర్యలు తీసుకోక పోవడంతోనే పరిస్థితి అదుపులోనికి రావడం లేదని పలువురు అంటున్నారు. ఇసలు ఈ దందాకు రేషన్ షాపు డీలర్లే ప్రథమ సూత్రదారులనే పుకార్లు ఉన్నాయి. ఇందుకు సంబంధిత అధికారులకు నెలవారీ మామూళ్లు కూడా ముట్ట చెబుదారని, అంతా తమకు అనుకూలంగా ఉండేలా వాతావరణాన్ని మార్చుకుంటారని పలువురు ఆరోపిస్తున్నారు.

# రోడ్డు ప్రమాదంలో సిపిఐ నేత మృతి

**ప్రజాపక్షం/ తల్లాడ :** భారత కమ్యూనిస్టు పార్టీ తల్లాడ మండల కార్యదర్శి ఓర్సు రమేష్ (48) బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించారు. సొంత పనుల నిమిత్తం నర్సింహారావుపేట గ్రామానికి వెళ్తుండగా వెనక నుంచి ఆర్టీసి బస్సు ఢీకొనడంతో రమేష్ తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందాడు. రమేష్ కమ్యూనిస్టు పార్టీ మండల కార్యదర్శిగా బహుముఖ ఉద్యమాలకు నాయకత్వం వహించారు. ఆయనకు భార్య, ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఎలక్ట్రానిక్స్ యూనియన్ సభ్యునిగా కూడా రమేష్ పనిచేస్తున్నారు. రమేష్ మృతదేహాన్ని ఖమ్మం తరలించి శవ పరీక్ష నిమిత్తం తిరిగి తల్లాడకు తీసుకు వచ్చారు. ఖమ్మంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ తదితరులు నివాళులర్పించారు. మృతదేహం తల్లాడకు చేరుకోగానే వందలాది మంది గ్రామ శివార్లకు చేరుకుని నివాళులర్పించారు. తల్లాడ శివారు నుంచి అంతిమ యాత్రలో సిపిఐ, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రమేష్ అమర్ హై అంటూ నినదించారు. రమేష్ మృతితో తల్లాడలో విషాద ఛాయలు అలుముకున్నాయి. నివాళులర్పించిన వారిలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తాటి వెంకటేశ్వరరావు, తోట రామాంజనేయులు, జాగర్ల మూడి రంజిత్, దండు ఆదినారాయణ, తల్లాడ ఇంచార్జి మద్దోజు శ్రావణ్, నిమ్మటూరి రామకృష్ణ, యోబు, యమాల గోపాలరావు, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, చింతల రమేష్, తల్లాడ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు, వివిధ పార్టీల నాయకులు షేక్ ఇసు, చల్లా నాగులు, సరికొండ శ్రీనివాసరాజు, గుంటుపల్లి వెంకటయ్య, రాయల నర్సింహారావు, తమ్మిశెట్టి నర్సింహారావు, గోపాలరెడ్డి, అనుమోలు సర్వేశ్వరరావు, నర్సింహారావు ఉన్నారు.

# ఆదివాసీల ఆత్మ గౌరవ ప్రతీక కొమరం భీమ్

(మొదటిపేజీ తరువాయి)

తోగ్గూడెంలో కొమరం భీమ్ విగ్రహాన్ని బుధవారం ఆవిష్కరించారు. పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ఆదివాసీల సంస్కృతిని, సంప్రదాయాలను కాపాడే బాధ్యత మనందరిపై ఉందన్నారు. నైజాం నిరంకుశ పాలనపై, పెత్తందారుల ఆగడాలకు ఎదురొడ్డి జల్ జంగిల్ జమీన్ నినాదంతో పోరాటం సాగించిన కొమరం భీమ్ ఆశయ సాధన కోసం ప్రతీ ఒక్కరు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. పోరాట యోధులను స్మరించుకోవటం మనందరి కర్తవ్యమన్నారు. మన రక్తం, మన పేగు బంధం అడవి తల్లితో పెన వేసుకొని ఉందని తెలిపారు. అడవితో ఇంతటి విడదీయరాని బంధం కలిగిన ఆదివాసీలను అడవి నుండి తరిమేయటానికి, హక్కులను కాలరాయటానికి పాలక ప్రభుత్వాలు అనేక రకాల కుట్రలు సాగిస్తున్నాయని ఆరోపించారు. గిరిజన గడ్డపై విప్లవ శంఖం పూరించి మన హక్కులను కాపాడుకోవటానికి పోరాటాలే మార్గమని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, రేగులగూడెం సర్పంచ్ రాములు, జర్పుల మోహన్, బదావత్ శ్రీను, నిడమనూరి శివరామకృష్ణ, కొమరం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో
# కాంగ్రెస్ నేత జావిద్ మృతి

**ప్రజాపక్షం/ ఖమ్మం :** చురుకైన నాయకునిగా, వివాదరహితుడిగా పేరొందిన కాంగ్రెస్ నగర మాజీ అధ్యక్షులు, టిపిసిసి కార్యవర్గ సభ్యులు మహ్మద్ జావిద్ (55) రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఖమ్మం నుంచి హైదరాబాద్ వైపు తానే వాహనాన్ని నడుపుకుంటూ వెళ్తున్న జావిద్ సూర్యాపేట జిల్లా తిరుమలగిరి సమీపంలో డివైడర్‌ను ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందారు. జావిద్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. జావిద్ తండ్రి ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేశారు. నేలకొండపల్లి మండలం బోదులబండ గ్రామానికి చెందిన జావిద్ విద్యార్థి దశలోనే ఎన్ఎస్‌యుఐ నాయకునిగా పనిచేసిన జావిద్ ఆ తర్వాత యూత్ కాంగ్రెస్‌లోనూ పని చేశారు. చాలా కాలం పాటు కాంగ్రెస్ నగర అధ్యక్షునిగా, టిపిసిసి సభ్యునిగా, సేవాదళ్ రాష్ట్ర బాధ్యునిగా పని చేశారు. కాంగ్రెస్ పార్టీ ఏ పని అప్పగించినా విజయవంతంగా పూర్తి చేసే జావిద్ మరణం కాంగ్రెస్ పార్టీలో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది.

**పలువురు సంతాపం :**

జావిద్ మృతిపట్ల పలువురు తీవ్ర సంతాపాన్ని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఒక నిబద్ధత కలిగిన నాయకున్ని కోల్పోయిందన్నారు. కాంగ్రెస్ పార్టీకి విభిన్న రూపాల్లో జావిద్ సేవలు అందించారని ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఆయనకు అన్ని విధాలా అండగా ఉంటుందని భట్టి తెలిపారు. జావిద్ లేని లోటు తీర్చలేనిదన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ జావిద్ అంకిత భావం కలిగిన కార్యకర్త అని ఆయన మరణం పార్టీకి తీరని లోటన్నారు. అరమరికలు లేకుండా పార్టీ విజయం కోసం కృషి చేశారన్నారు. ఆయన మరణించడం పార్టీకి తీరని లోటన్నారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ జావిద్ మరణ వార్త దిగ్భ్రాంతి కలిగించిందన్నారు. కాంగ్రెస్ పార్టీలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సాధించుకున్న జావిద్ అకాల మరణం తనను ఎంతగానో బాధించిందన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ విశిష్ట సేవలు అందించిన జావిద్ మృతిపట్ల తీవ్ర సంతాపాన్ని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో రాజ్యసభ సభ్యులు రేణుకా చౌదరి, వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంఎల్‌సి తాతా మధు, మాజీ ఎంపి నామ నాగేశ్వరరావు, ఖమ్మం ఎంపి రామసహాయం రఘురాంరెడ్డి, శాసన సభ్యులు మట్టా రాగమయి, రాందాస్ నాయక్, రాష్ట్ర కార్పోరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, నాయుడు సత్యనారాయణ, మువ్వా విజయ్‌బాబు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ, మాజీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాగండ్ల దీపక్ చౌదరి, మేయర్ పునుకొల్లు నీరజ, పలువురు కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు. సిపిఎం, బిఆర్ఎస్ పార్టీలు సైతం జావిద్ మరణం పట్ల తీవ్ర సంతాపాన్ని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశాయి.

**సిపిఐ సంతాపం :**

జావిద్ మృతి పట్ల సిపిఐ తీవ్ర సంతాపాన్ని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది. సంతాపం తెలిపిన వారిలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, నగర కార్యదర్శి జానిమియా, రాష్ట్ర సమితి సభ్యులు మహ్మద్ సలాం తదితరులు సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు.

# ప్రతి గ్రామానికి మెరుగైన సదుపాయాలే ప్రభుత్వ లక్ష్యం



**-డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క**

**-రూ.7.50 కోట్లతో నిర్మించిన కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ప్రారంభం**

**ప్రజాపక్షం/పెనుబల్లి :** ప్రతి గ్రామానికి మెరుగైన సదుపాయాలు కల్పించడం లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. బుధవారం రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఎన్పిడిసిఎల్ సిఎండి వరుణ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ లతో కలిసి టీజీ ఎన్పిడిసిఎల్ ద్వారా పెనుబల్లి మండలం తుమ్మలపల్లిలో నూతనంగా నిర్మించనున్న విద్యుత్ నియంత్రికల మరమ్మతు కేంద్ర నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి, పెనుబల్లిలో రూ.7 కోట్ల 50 లక్షల వ్యయంతో నిర్మించిన వైద్య విధాన పరిషత్‌కు చెందిన 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యం, విద్య రంగాలను అత్యున్నత ప్రాధాన్యతగా తీసుకుని ముందుకు సాగుతున్నదని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బలోపేతం చేస్తున్నామని తెలిపారు. అలాగే విద్యా రంగంలో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసి, విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని వివరించారు. నూతనంగా చేపట్టిన సబ్‌స్టేషన్ల నిర్మాణం, మరమ్మత్తు కేంద్రాల ద్వారా వినియోగదారులకు నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించడంతో పాటు ప్రస్తుత సబ్‌స్టేషన్లపై ఉన్న ఓవర్ లోడ్ తగ్గుతుందని తెలిపారు. ఈ సబ్‌స్టేషన్ల ద్వారా వేలాది మంది వినియోగ దారులకు ప్రయోజనం కలగడంతో పాటు విద్యుత్ వోల్టేజ్ నియంత్రణ, పవర్ ఫ్యాక్టర్ మెరుగుదల సాధ్యమవుతుందని అన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ..గ్రామీణ ప్రాంతాల్లో మౌళిక వసతుల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. వి ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర హస్తకళల సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఏసిపి, ఎస్ఈ ఎన్పిడిసిఎల్ శ్రీనివాస చారి, డి.ఎం అండ్ హెచ్.ఓ. డాక్టర్ రామారావు, డిసిహెచ్ఎస్ రాజశేఖర్ గౌడ్, తహశీల్దార్, ఎంపీడీఓ, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# నిజాయితీతో సేవలు అందించాలి

**-దాతల సహకారం అభినందనీయం**

**-గ్రంథాలయం, కళావేదికను ప్రారంభించిన డిఈవో**





**-ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** నిజాయితీ, నిబద్ధతతో సమాజానికి సేవలు అందించాలని జిల్లా విద్యాశాఖాధికారి చైతన్యజైని తెలిపారు. పాఠశాల అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని ఆమె తెలిపారు. బుధవారం మండల పరిధిలోని మంచుకొండ ఉన్నత పాఠశాలలో మందడపు పద్మ మందడపు నర్సింహారావు దంపతులు రూ. 7లక్షలతో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ముఖ్య అతిథిగా హాజరైన డిఈవో చైతన్యజైని ప్రారంభించారు. కళావేదికను డిఈవోతో పాటు స్వాతంత్ర్య సమరయోధులు మందడపు సత్యనారాయణ లు ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఈవో మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని తెలిపారు. సమాజానికి తాము ఏమిస్తున్నామనేది గుర్తెరిగి సేవలు అందించాలని తెలిపారు. విద్యార్థులు కూడా ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని వాటి సాధనకు కృషి చేయాలన్నారు. మంచుకొండ పాఠశాల అభివృద్ధిలో తల్లి దండ్రులు, దాతలు అందిస్తున్న సహకారం చూస్తుంటే ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇలాంటి ప్రోత్సాహం ఉంటే ఉపాధ్యాయులు కూడా ఉత్తమ విద్యను అందించేందుకు కృషి చేస్తారని తెలిపారు. విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించేందుకు తాను వ్యక్తిగతంగా గిఫ్ట్ టు చిల్డ్రన్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. నేలకొండపల్లిలో విద్యార్థుల కోసం స్నాక్స్ అందించే కార్యక్రమాన్ని పూర్తిగా తాను దత్తత తీసుకుని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మంచుకొండ పాఠశాలలో పదవ తరగతి పరీక్షల్లో టాప్ ర్యాంకు సాధించే విద్యార్థినికి సైకిల్ బహుమతిగా అందిస్తానని ఆమె తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందించి ఉత్తమ ఫలితాల సాధనకు దోహద పడతాయన్నారు. చిన్న చిన్న కార్యక్రమాల ద్వారా పెద్ద పెద్ద మార్పులు తీసుకు రావచ్చని ఆమె తెలిపారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ సర్పంచ్ మందడపు సత్యనారాయణ తో పాటు స్థానిక మాజీ ప్రజాప్రతినిధులను, దాతలను ఘనంగా సన్మానించారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. హెచ్ఎం కరుణకుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఈవో రాములు, సర్పంచ్ తేజావత్ శంకర్, ఉప సర్పంచ్ ముకుందమ్మ, మాజీ సొసైటీ ఛైర్మన్లు మందడపు సుధాకర్, తుమ్మలపల్లి మోహన్‌రావు, ఏఎంసి ఛైర్మన్ ప్రమీల, మాజీ ప్రజాప్రతినిధులు మందడపు మాధవరావు, భూక్యా లక్ష్మణ్ నాయక్, పద్మావతి, ఏసుబు, చెన్నులింగం, తులసి, పుల్లయ్య, కృష్ణవేణి, భిక్షం, దీప్లానాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పాము కాటుతో మహిళ మృతి



**ప్రజాపక్షం/బోనకల్ :** పాము కాటుకు గురై మహిళ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని పెద్దబీరవల్లి గ్రామంలో బుధవారం జరిగింది. స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని పెద్దబీరవల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ గ్రామశాఖ అధ్యక్షులు పంది వెంకులు పెద్ద కోడలు పంది వీరలక్ష్మి (40) బుధవారం ఉదయం తమ వ్యవసాయ పొలంలో మొక్కజొన్న కంకుల విరుస్తున్న సమయంలో వీరలక్ష్మి పాము కాటుకు గురైంది. చికిత్స కోసం ఖమ్మం ఆస్పత్రికి తరలిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందినట్లు తెలిపారు. వీరలక్ష్మి కి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. వరలక్ష్మి మృతితో వారి కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# ఎయిడ్స్ రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యం

**-డాక్టర్ చందు నాయక్**



**ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగం :** ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ఎయిడ్స్ రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యమని డాక్టర్ చందు నాయక్ తెలిపారు. ఆలయ ఫౌండేషన్ మార్గదర్శకులు ఐఏఎస్ ఆదేశాల మేరకు ఆలయ ఫౌండేషన్, ఆశా పాజిటివ్ ఫీపుల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో, స్థానిక కేర్ అండ్ సపోర్ట్ సెంటర్ కార్యాలయంలో 13 హెచ్ఐవి బాధిత చిన్నారులకు పౌష్టికాహార పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ చందు నాయక్ మాట్లాడుతూ హెచ్ఐవి వైరస్‌తో జీవిస్తున్న వారికి పౌష్టికాహారం అత్యంత కీలకమని పేర్కొన్నారు. సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా శరీరంలో వ్యాధి నిరోధక శక్తి పెరిగి, వైరస్ అదుపులో ఉంటుందని వివరించారు. ప్రభుత్వ ఏఆర్‌టి సెంటర్ ద్వారా లభించే మందులతో పాటు పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపవచ్చని ఆయన భరోసా ఇచ్చారు. నాకో, తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ నిర్ధేశించిన 959599 లక్ష్యాలను అధిగమించి, ఖమ్మం జిల్లాను ఆదర్శంగా నిలపాలని పిలుపునిచ్చారు. విద్యకు భరోసా హెచ్ఐవి బాధిత చిన్నారులు చదువు విషయంలో ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారికి పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. చిన్నారుల ఉన్నత చదువుల కోసం ఆర్థిక సాయం అందించే విషయంపై ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని హామీ ఇచ్చారు. ప్రోగ్రాం మేనేజర్ టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ హెచ్ఐవి తో జీవిస్తూ గవర్నమెంట్ ఆర్ట్ సెంటర్‌లో మందులు తీసుకుంటున్న వారిని క్రమం తప్పకుండా మందుల వాడించాలని, తద్వారా వైరల్ లోడ్ తగ్గి సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటూ, జీవిత కాలం కూడా పెరగడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. అలాగే ఫాలోఅప్ చేసిన రిపోర్ట్స్ అన్ని వివరాలను సోచ్ మొబైల్ అప్ ద్వారా ఎంట్రీ చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అప్సా ప్రాజెక్ట్ మేనేజర్ శంకర్, డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం మేనేజర్ సత్యకుమార్, హైదరాబాద్ లెప్రా సంస్థ స్టేట్ ప్రోగ్రాం మేనేజర్ టి వెంకటేశ్వర్లు, డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం అసిస్టెంట్ రామకృష్ణ, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు, బాధిత చిన్నారుల కుటుంబ సభ్యులు, కోఆర్డినేటర్స్, సుందర్, నవీన్, రాము, కమ్యూనిటీ లైసోన్ ఫర్ హెల్త్ తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నియమాలపై అవగాహన కలిగి ఉండాలి

**-రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన**




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నియమాలపై అవగాహన కలిగి ఉండాలని రఘునాథపాలెం ఇన్‌స్పెక్టర్ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని కోయచలక గ్రామంలో అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రతపై ఎన్‌జెపిటిబిసిడబ్ల్యూఆర్ పాఠశాల విద్యార్థులకు, స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ ఉస్మాన్ షరీఫ్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నియమాల పట్ల అవగాహన కలిగి ఉంటే ప్రమాదాలను నివారించవచ్చునన్నారు. పాఠశాలల్లో ట్రాఫిక్ సిగ్నల్స్, జీబ్రా క్రాసింగ్, హెల్మెట్, సీట్ బెల్ట్ వాడకం పై అవగాహన కల్పించాలన్నారు. సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలన్నారు. రోడ్డు దాటేటప్పుడు కూడా కుడి, ఎడమలు చూసుకుని దాటాలన్నారు. అతివేగం ఎంతో ప్రమాదకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నరేష్, ఉపాధ్యాయులు, స్థానికులు పాల్గొన్నారు.

# ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించాలి

**-మేయర్ పునుకొల్లు నీరజ**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు పోలియో వ్యాక్సిన్ వేయించాలని ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ తెలిపారు. బుధవారం ఖమ్మం నగరంలోని ఆరవ డివిజన్ బస్తీ దవాఖానా ఆయుష్ ఆరోగ్య మందిర్‌లో జరిగిన కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ హాజరై పోలియో వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా పోలియో నిర్మూలనకు ఈ వ్యాక్సిన్ ఎంతో ముఖ్యమన్నారు. ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించేందుకు తల్లిదండ్రులు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ నాగండ్ల కోటేశ్వరరావు, వైద్యురాలు శ్రీయ, ఎఎన్ఎం ప్రమీలరాణి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ చీరలు పంపిణీ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** కార్పోరేషన్ పరిధిలోని పలు డివిజన్లలో మేయర్ పునుకొల్లు నీరజ ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. బుధవారం కార్పోరేషన్ పరిధిలోని 51, 6, 4 డివిజన్లలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ పాల్గొని మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మహిళల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళల జీవనోపాధిని మెరుగుపర్చడానికి కృషి చేస్తుందన్నారు. ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500 గ్యాస్, వడ్డీ లేని రుణాలు అందిస్తుందన్నారు. మహిళలు ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు శీలంశెట్టి రమావీరభద్రం, నాగండ్ల కోటేశ్వరరావు, దండా జ్యోతిరెడ్డి, నాయకులు ఏలూరి శ్రీనివాసరావు, మాధవరావు, నాగులమీరా తదితరులు పాల్గొన్నారు.

# సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలి

**-ఏఐవైఎఫ్ నిర్మాణ బాధ్యులు కొండపర్తి**




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పాలకులు అవలంభిస్తున్న విధానాలపై యువత, విద్యార్థులు సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐవైఎఫ్ నిర్మాణ బాధ్యులు కొండపర్తి గోవిందరావు పిలుపునిచ్చారు. బుధవారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కొండపర్తి గోవిందరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యాయన్నారు. నిరుద్యోగులను ఎన్నికల సమయంలో రాజకీయ లబ్ది కోసం వాడుకుంటూ హామీలు గుప్పిస్తున్నారని ఆ తర్వాత వాటిని విస్మరిస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ భృతిని వెంటనే అమలు చేయాలన్నారు. యువత, విద్యార్థులు పాలకుల విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ మాజీ జిల్లా కార్యదర్శులు దండి సురేష్, జమ్ముల జితేందర్‌రెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ, జిల్లా ఆఫీస్ బేరర్స్ మామిళ్ల శ్రీనాథ్‌రెడ్డి, శ్రావణ్ కుమార్, గనపారపు ఉపేందర్, చింతల రమేష్, కొల్లు రవి, సతీష్‌రెడ్డి, పగిడిపల్లి ఏసు పాల్గొన్నారు.

# బాజాపా పోరాట ఫలితమే ఆసుపత్రి ప్రారంభం



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లిలో నేడు వంద పడకల ఆసుపత్రి ప్రారంభానికి కారణం నాటి భాజపా పోరాట ఫలితమైనన్నారు భాజపా నాయకులు. ఈ సందర్భంగా బుధవారం బాజాపా నాయకులు ఓ ప్రకటన విడుదల చేశారు. అనునిత్యం ప్రజా సమస్యల పై పోరాడే బీజేపీ శ్రేణులు అరెస్టులకు, కేసులకు తలొగ్గకుండా పత్రికలు, వార్తా ప్రసారాల ద్వారా సామాజిక మాధ్యమాల ద్వారా 100 పడకల ఆసుపత్రి అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తూ తద్వారా ప్రభుత్వం పై తీవ్ర ఒత్తిడి తెచ్చారన్నారు. దీని ఫలితం గా ఆసుపత్రిలో పూర్తి కానీ చిన్న, చిన్న పనులు వేగంగా పూర్తి చేసి నేడు అట్టహాసంగా ప్రారంభించారన్నారు. ఇది ముమ్మాటికి భారతీయ జనతాపార్టీ విజయమేనన్నారు. భారతీయ జనతాపార్టీ శ్రేణులు జరిపిన పోరాట ఫలితంగానే నేడు 100 పడకల ఆసుపత్రి పేదప్రజలకు అందుబాటులోకి వచ్చిందని బీజేపీ శ్రేణులు ఆనందాన్ని వ్యక్తం చేశారు.

## విపత్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



ప్రజాపక్షం/భద్రాచలం: ప్రకృతి విపత్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్టిసి డిఎం జంగయ్య అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో అగ్నిమాపక వారోత్స వాల్లో భాగంగా బుధవార ం ప్రయాణికుల ప్రాంగణం ఆవరణలో పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం అదే ప్రాంతంలో అగ్ని ప్రమాదం హఠాత్తుగా సంభవించినప్పుడు తీసుకోవాల్సిన తక్షణ జాగ్రత్తలపై డిఫెన్స్ బృందంతో కలిసి డెమో నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎం మాట్లాడుతూ అనుకోకుండా సంభవించే విపత్తుల తీరని నష్టాలతో పాటు ఇబ్బందులను తెచ్చిపెడతాయని, అత్యవసర పరిస్థితుల్లో భయానికి గురికాకుండా మెళుకువలు తెలుసుకుని ప్రమాదాన్ని నివారించడంతో పాటు నష్టాన్ని నిలువరించొచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో విజయశ్రీ, టి శ్రీనివాసరావు, డికేపిఎ రాజు, ఆర్టీసి ఉద్యోగులు, ప్రయాణికులు పాల్గొన్నారు.

## అథ్లెటిక్స్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి



ప్రజాపక్షం/పాల్వంచ : అథ్లెటిక్స్ క్రీడలో ఉన్నత శిఖరాలకు చేరుకొని జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తీసుకొని రావాలని కొత్తగూడెం మునిసిపల్ కార్పోరేషన్ డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి అన్నారు. గత కొన్ని రోజుల క్రితం హనుమకొండ జేఎన్ స్టేడియంలో జరిగిన 11వ, తెలంగాణ రాష్ట్ర సీనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ క్రీడలో పాల్వంచకు చెందిన క్రీడా కారులు మొత్తం 14 పతకాలను కైవసం చేసుకొని సత్తా చాటారు. దీనితో బుధవారం అభినందన సభ నిర్వహించారు. ఈ సంధర్భంగా విజేతలను, కోచ్ పి. నాగేంద్రలను ఘనంగా అభినందించారు. క్రీడాకారులకు మెడల్స్ అందజేశారు. అనంతరం డిప్యూటి మేయర్ మాట్లాడుతూ క్రీడాకారులు కోచ్‌ల సూచనలు, సలహాలతో కఠోర శిక్షణ పొందాలన్నారు. దీనితో భవిష్యత్‌లో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలను సాధించి గ్రామ, జిల్లా, రాష్ట్ర ఖ్యాతిని మరింత పెంచాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎక్కువ పతకాలను సాధించటం ప్రశంశనీయమన్నారు. శ్రీనివాస కాలనీలో గల అథ్లెటిక్స్ గ్రౌండ్ కు కావలసిన మౌళిక సదుపాయాల కల్పనకు తన వంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం తెలుగుదేశం పార్టీ నాయకులు కనగాల అనంతరాములు, ఈవెంట్ మేనేజర్ రమేష్, అథ్లెటిక్స్ కోచ్ పి. నాగేంద్రలను సన్మానించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ కే. మహీధర్, డిగ్రీ కళాశాల పిడి శ్వేత, చావా రవి తదితరులు పాల్గొన్నారు.

## కేటిపిఎస్ కాలనీలో ఓపెన్‌జిమ్ ఏర్పాటు చేయాలి



ప్రజాపక్షం/పాల్వంచ : కేటిపిఎస్ కాలనీలో పారిశుద్ధ్య పనులు నిర్వహించి ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని కొత్తగూడెం మునిసిపల్ కార్పోరేషన్ పాల్వంచ 4వ, డివిజన్ కార్పోరేటర్ చెరుకు భాగ్యలక్ష్మి అన్నారు. గత సంవత్సరం కేటిపిఎస్‌కు సంభంధిన మునిసిపాలికి చెల్లించాల్సిన రూ.36,54,146/లు విలువైన చెక్కును కేటిపిఎస్ సివిల్ ఏడిఈలు బి.శ్రీను, దీపికలతో కలిసి మునిసిపల్ కార్పోరేషన్ కమీషనర్ కే. సుజాత బుధవారం అందజేశారు. అనంతరం కార్పోరేటర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ కేటిపిఎస్ కాలనీ నుండి పన్నులు వసూలు చేస్తున్నారు కానీ పారిశుద్ధ్య పనులు చేపట్టడం లేదన్నారు. ఇకనుండైనా కాలనీలో మొక్కల పెంపకం చేపట్టి పార్కుల నిర్వాహణ, పారిశుద్ధ్య పనులు చేపట్టాలని కమీషనర్‌ను కోరారు. అదే ప్రజలకు ఉపయోగ పడే విధంగా ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలన్నారు. దీనికి కమీషనర్ సానుకూలంగా స్పంధించారని ఆమె తెలిపారు.

## ఉపాధి సిబ్బందికి ప్రభుత్వ నజరానా



ప్రజాపక్షం/బూర్గంపాడు:ఉపాధి హామీ పథకంలో క్షేత్రస్థాయిలో పని చేస్తున్న సిబ్బందిని ప్రోత్సహిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నజరానా ప్రకటించింది. గ్రామాల్లో కూలీలకు ఎక్కువగా ఉపాధి కల్పించి, నిబంధనల ప్రకారం హాజరు నమోదు చేసి ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ఈ ప్రోతత్సాహకం అందజేస్తున్నారు. ఈ నేపథ్యంలో బూర్గంపాడు మండలం ఉప్పుసాకకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీను, తన పనితీరుతో గుర్తింపు పొందారు. ఆయనకు అడిషనల్ డీఆర్‌డీవో రవికుమార్ చేతుల మీదుగా రూ 1000నగదు బహుమతిని బుధవారం అందజేశారు. ఈసందర్భంగా అధికారులు శ్రీను పనితీరును అభినందిస్తూ, ఇతర సిబ్బంది కూడా ఇదే విధంగా సేవలు అందించాలని సూచించారు.

## జావేద్ మృతి కాంగ్రెస్‌కు తీరని లోటు

ప్రజాపక్షం/కారేపల్లి: ఖమ్మం నగర్ కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షులు, పీసీసీ సభ్యుడు మహమ్మద్ జావేద్ దుర్మరణం పట్ల సింగరేణి మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు గుగులోత్ హర్ష నాయక్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సూర్యాపేట జిల్లా మోతే సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో జావేద్ మృతి చెందడం కాంగ్రెస్ పార్టీకి, ఖమ్మం జిల్లా రాజకీయాలకు పెద్ద లోటుగా పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి పని చేసిన నిబద్ధత గల నాయకుడిని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. జావేద్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబానికి ధైర్యం కలగాలని ప్రగాఢ సంతాపం తెలిపారు.

# ఊరంతా పెయింటర్లే..!

● రంగులేయడంలో ఆరితేరిన దళితులు







ప్రజాపక్షం/జూలూరుపాడు: జూలూరుపాడు మండలం జూలూరుపాడు గ్రామమైన భగత్ సింగ్ కాలనీ పెయింటర్లకు కేరాఫ్ అడ్రస్ గా మారింది. 100 కుటుంబాలు, 500 కు పైగా జనాభా కలిగిన భగత్ సింగ్ కాలనీ పూర్తిగా దళిత వాడకు చెందిన గ్రామ జనాభాలో ఉన్న పురుషుల్లో 50 మందికి పైగా పెయింటింగ్ రంగంలో స్థిరపడ్డారు. ఇందులో మరో విశేషం ఏమిటంటే యువకులంతా పూర్తిగా పెయింటర్ వృత్తిని ఎంచుకోవడం.

### 50 మంది పెయింటింగ్ రంగం వైపు...

గ్రామంలో 30 మందికి పైగా యువకులు ఇంటర్మీడియట్, డిగ్రీ వరకు చదువుకున్నప్పటికీ పెయింటర్ వృత్తి సాగిస్తున్నారు. మిగిలిన వారిలో కొందరు వ్యవసాయం, ఆ తర్వాత పెయిం టింగ్ పనులకు వెళ్లడం అలవాటుగా చేసుకున్నారు. గ్రామానికి చెందిన ప్రభాకర్, రమేష్, నరసింహారావు, పవన్ తొలుత ఉపాధి కోసం ఖమ్మం హైదరాబాదు నగరం బాట పట్టారు. గృహాలకు రంగులు వేసే రోజువారీ కూలి పనులకు వెళ్లి క్రమక్రమంగా రంగులు వేయడంలో నైపుణ్యాన్ని సాధించారు. దీనితో రోజు భవన నిర్మాణ కూలీలకు చెల్లించే కూలికి రెట్టింపు కూలీ లభిస్తుండడంతో పెయింటింగ్ వృత్తిని ఎంచుకున్నారు. ఆ తర్వాత వీరి బాటలో గ్రామానికి చెందిన సుమారు 50 మంది వరకు యువకులు పెయింటింగ్ రంగం వైపు దృష్టి సారించారు.

### రోజుకు రూ.800 నుంచి 1,000...

భవన నిర్మాణ పనికి వెళ్తే రోజుకు రూ.500 కూలీ లభిస్తుండగా అదే వీరికి పెయింటింగ్ రంగంలో రాణించడం వల్ల ఎనిమిది వందల నుంచి వెయ్యి రూపాయలు అందుతున్నాయి. పెయింటింగ్ పనులు నిర్వహించడానికి భగత్ సింగ్ కాలనీకి చెందిన యువకులంతా కొత్తగూడెం, ఖమ్మం, హైదరాబాద్ నగరాలకు వెళ్తున్నారు. కొందరు గ్రామంలో ఉంటూ సీజన్లో వ్యవసాయ పనులు నిర్వ హిస్తూ, ఇతర రోజుల్లో పరిసర ప్రాంతాల్లో పెయింటింగ్ పనులకు వెళ్తున్నారు. పెయింటింగ్ పనులతో తమకు నిత్యం ఉపాధి లభిస్తోందని, యువకులంతా ఈ రంగం పైనే ఆధారపడి జీవిస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. అయితే, ప్రభుత్వం తగిన ప్రోత్సాహం అందించి, నైపుణ్యాభివృద్ధి కల్పిస్తే దళిత కాలనీ కి చెందిన యువకులు మరింత అభివృద్ధి సాధించే అవకాశం ఉందని పేర్కొన్నారు.

**ప్రభుత్వం సహాయం అందించాలి... బుడిపుడి ప్రభాకర్, బాబురావు పెయింటర్స్ , భగత్ సింగ్ కాలనీ**

ఉపాధి కోసం పెయింటింగ్ పనులకు వెళ్తున్న యువతకు ప్రభుత్వం సహాయం అందించాలి. చదువుకొని పెయింటింగ్ రంగంలో స్థిరపడ్డ యువతకు శిక్షణ ఇప్పించి, ఆధునిక పరికరాలు అందించాలి. వీరిని సొసైటీగా ఏర్పాటు చేసి ప్రభుత్వ భవన నిర్మాణ రంగంలో అవకాశాలు కల్పించాలి. మెరుగైన జీవనం కోసం ప్రభుత్వం చేయూతనందించాలి.

# వందల కాకుల మర్మం..!

- నర్సింహులగూడెంలో ప్రకృతి సందేశమా...? లేక విశేషమా..?





ప్రజాపక్షం/కూసుమంచి: మండలంలోని నర్సింహులగూడెం గ్రామంలో ఒక ఆశ్చర్యకర దృశ్యం ప్రతి రోజూ కనిపిస్తోంది. గ్రామంలోని ప్రధాన రహదారి వెంట వేప, చింత చెట్లపై వందల సంఖ్యలో కాకులు చేరి కూర్చోవడం స్థానికులను ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఉదయం 5గంటలకు ఒక సారి సాయంత్రం ఐదు నుండి ఆరు గంటల ప్రాంతంలో మరో సారి పక్షుల కళకళతో గ్రామము ఒక అల్లాదకరమైన వాతావరణం సంతరించుకొని అందరినీ ఆకర్షిస్తుంది. ఇదే పరిస్థితి చుట్టు పక్కల గ్రామాల్లో కనిపించకపోవడం మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. గత రెండు మూడు సంవత్సరాల నుండి కాకుల గుంపు ఈ గ్రామంలోని ఎక్కువగా కనిపించడం విశేషం. మండలంలోని అనేక గ్రామాల్లో ప్రజల తద్దినాల సందర్భంగా పిండ ప్రతానం చేయటానికి కాకుల కోసం ఎదురుచూస్తున్న మచ్చుకైనా ఒక్క కాకి కూడా కనిపించదు దాని కూత వినిపించదు అయినా ఎదురుచూసి చూసి ఆ పిండ ప్రధానను పశువులకు పెట్టడం లేక గంగలో కలిపి ప్రజలు తదుపరి కార్యక్రమాలు నిర్వహించుకుంటున్న పరిస్థితి ఉంది. ఈ గ్రామంలో మాత్రం కుప్పలు తెప్పలుగా వందలాది కాకులు ఒక ప్రత్యేకతను సంతరించుకొని అటుగా పాలేరు నుండి బంగ్లా వైపు వెళ్లే బాటసారులను, ప్రయాణికులను ఓ ఆలోచనకు గురి చేస్తున్నాయి. ప్రాచీన కాలం నుండి కాకికి మన సంస్కృతితో ప్రత్యేక స్థానం ఉంది. పితృదేవతల ప్రతీకగా భావించే ఈ పక్షి, ఇక్కడ ఇలా గుంపుగా కనిపించడం కొందరికి ఆధ్యాత్మిక సంకేతంలా అనిపిస్తుండగా, మరి కొందరికి ఇది ప్రకృతి వైవిధ్యంగా కనిపిస్తోంది. అయితే శాస్త్రీయంగా చూస్తే,కాకులు ఇలా గుంపుగా చేరడానికి కొన్ని కారణాలు ఉన్నాయి. పర్యావరణ శాస్త్రవేత్తల ప్రకారం కాకులు సాధారణంగా భద్రత కోసం, ఆహారం కోసం, సమాచారం పంచుకోవడం కోసం ఒకే చోట పెద్ద సంఖ్యలో చేరుతాయి. ఇది కమ్యూనల్ రోస్టింగ్ అని పిలవబడే సహజ లక్షణం. చలికాలం లేదా ఆహారం ఎక్కువగా ఉన్న ప్రదేశాలలో ఇలా వందల కాకులు ఒకే ప్రాంతంలో నివసించడమం సహజమే. అయినా నరసింహులగూడెంలో కనిపిస్తున్న ఈ ప్రత్యేక దృశ్యం వెనుక కారణాలు తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. గ్రామ పరిసరాల్లో ఏదైనా ప్రత్యేక ఆహార వనరు ఉందా...లేదా చెట్ల సముదాయం కారణమా..లేదా వాతావరణ పరిస్థితుల ప్రభావమా అన్నది పరిశీలించాల్సి ఉంది. ఇంకా ఒక ఆసక్తికర విషయం ఏమిటంటే కాకులు అత్యంత తెలివైన పక్షులు. వీటి మధ్య సమాచార మార్పిడి వ్యవస్థ చాలా బలంగా ఉంటుంది. ఒక కాకి కనుగొన్న ఆహారం, ప్రమాదం వంటి విషయాలను మరొక కాకికి తెలియజేస్తుంది.

### గ్రామ ప్రజల అభిప్రాయం....

గ్రామస్తులు మాత్రం ఈ దృశ్యాన్ని ఆశ్చర్యంగా చూస్తున్నారు. కొంత మంది ఇది శుభ సూచకమని భావిస్తుండగా, మరికొందరు ఇది ప్రకృతి హెచ్చరిక కాదా అనే అనుమానంతో ఉన్నారు. నరసింహులగూడెంలో కనిపిస్తున్న ఈ కాకుల సమూహం ఒక ప్రకృతి విశేషం కావచ్చు లేదా పర్యావరణ మార్పుల సూచిక కావచ్చు. ఏదైమైనా ఈ ఘటనపై అటవీ శాఖ లేదా పర్యావరణ నిపుణులు అధ్యయనం చేస్తే గ్రామానికి మాత్రమే కాదు. మొత్తం ప్రాంతానికి ఉపయోగకరమైన సమాచారం లభించే అవకాశం ఉంది. కూసుమంచి మండలంలోని నరసింహులగూడెం గ్రామంలో ఒక కాకులే కాకుండా వాటితో పాటు కొంగలు, గోరింకలు, వివిధ రకాల పశుపక్షాదులన్నీ అన్నింటికీ ఈ గ్రామము కేంద్ర బిందువుగా మారింది ఈ పుష్పక్షాదులన్నింటిలో అధికంగా కాకులు ఉండటం విశేషం.

# దేవుడి పేరుతో దేవాంతకుడు!

**'నామాలు దేవుడి' నామధేయం.. ఆహారంలో అడ్డగోలుతనం**
**కొణిజర్ల నుంచి తనికెళ్ల మార్గంలో ఓ హోటల్ నిర్వాకం**
**నిద్రపోతూ నెల జీతాలు పుచ్చుకుంటున్న ఫుడ్ సేఫ్టీ యంత్రాంగం**



ప్రజాపక్షం/ కొణిజర్ల : ఇంట్లో వాడుకునే వస్తువుల్లో కల్తీ ఉన్నా మనకు ఆర్థికంగానే నష్టం జరుగుతుంది.. మరి కడుపులోకి తీసుకునే ఆహారంలో కల్తీ జరిగితే ఏం జరుగుతుందో ఊహించండి.! రోగాలు చుట్టు ముట్టడం ఖాయం.. శరీర అవయవాలు ఒక్కొక్కటిగా దెబ్బతినడం ఆ తర్వాత జరిగే పనిగా మారుతుంది.. ఇంట్లో మనం ఏరికోరి వండుకునే ఆహార పదార్థాల విషయంలో అనేక జాగ్రత్తలు తీసుకుంటాం.. మరి అనుకోకుండా బయటి హోటళ్లలో ఆహారం తీసుకోవాల్సి వస్తే పరిస్థితి ఏంటి.? అది తాజాగా ఉన్న ఆహారమేనా..? ఒక వేళ అందులో కల్తీ పదార్థాలు ఏమైనా కలిపారా..? వేడి వేడిగా వడ్డిస్తున్న ఆ ఆహారంలో విష పూరితమైన పదార్థాల శాతం ఎంత.? అనేవి ఆలోచిస్తేనే గొంతులోకి ముద్ద దిగన ప్రశ్నలుగా అనిపిస్తాయి.. బతకడానికి మరో మార్గం లేక ఫుడ్ బిజినెస్‌ను ఎంచుకుంటున్న కొందరు వ్యక్తులు ప్రజల ఆరోగ్యాలతో ఆటలాడుతున్నారు. ఇష్టారీతిన ఎడాపడా వండి వడ్డిస్తూ జనం ఆరోగ్యాన్ని గుల్ల చేస్తున్నారు. ఈ అడ్డగోలుతనాన్ని నివారించాల్సిన ప్రభుత్వ యంత్రాంగం నిద్రలోనే జోగుతోంది. ఫలితంగా అడ్డగోలు ఫుడ్ బిజినెస్ మూడు దమ్ బిర్యానీలు, ఆరు ఫుల్ మీల్స్‌గా సాగిపోతోంది.

ఖమ్మం జిల్లా యంత్రాంగం మొత్తాన్ని అదుపు చేసే జిల్లా కలెక్టరేట్‌కు అయిదు కిలోమీటర్ల దూరంలో నడుస్తున్న ఒక హోటల్‌లో అడ్డగోలు తనం రాజ్యమేలుతోంది. ప్రశ్నించే వారే లేకపోయేసరికి విచ్చలవిడితనంతో ఇష్టారీతిన జనానికి వండి వడ్డిస్తూ వారి ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న పరిస్థితి నెలకొంది. ఖమ్మం జిల్లా కేంద్రం నుంచి మొదలుకుని వైరా వరకు అనేక రకాల ఫుడ్ సెంటర్లు వెలిసి ఆ రోడ్డు మీదుగా వెళ్లే ప్రజలకు ఆహ్వానిస్తున్నాయి. ఈక్రమంలో చాలా ఏళ్లుగా పాతుకుపోయిన ఓ ఫుడ్ సెంటర్ ప్రజలకు కల్తీ ఆహారం వడ్డిస్తూ తమది ఎంతో ఆహార్యం కలిగిన హటల్ అంటూ గప్పాలు కొట్టుకుంటోంది. కొణిజర్ల నుంచి ఖమ్మం వచ్చే మార్గంలో తనికెళ్ల ప్రధాన కాలువ సమీపంలో నిర్వహిస్తున ఈ హటల్ అడ్డగోలు తనానికి చిరునామాగా మారింది. 'నామాలు దేవుడి పేరు' అంటూ దేవుని నామధేయంతో కొన్నేళ్లుగా నడుస్తున్న హోటల్‌లో జనానికి ఎలాంటి ఆహారం వండి వడ్డిస్తున్నారో అంతు చిక్కకుండా మారింది. పగలూ రాత్రీ తేడా లేకుండా భారీ బిజినెస్‌ను నడుపున్న ఆ హోటల్ యాజమాన్యం కళ్లు ఆకాశాన్ని చూస్తూ జనానికి మాత్రం కల్తీ ఆహారాన్ని వడ్డిస్తున్నాయి. వీళ్లు ఎన్ని ఆగడాలు చేస్తున్నా వీరిని అదుపు చేసే నాధులే లేకుండా పోయాయి.

### నిద్ర పోతున్న ఫుడ్ సేఫ్టీ యంత్రాంగం..

ఆహార కల్తీ అత్యంత ప్రమాదకరమైనదని తెలిసినా ఫుడ్ సేఫ్టీ అధికారులు కల్తీపై దృష్టిసారించిన దాఖలాలు లేవు. ప్రజారోగ్యం కోసం పెద్ద పీట వేస్తున్న ప్రభుత్వం ఆహార తనిఖీల కోసం ఒక శాఖనే ఏర్పాటు చేశాయి. ఆహార బిజినెస్ చేస్తున్న హోటళ్లు, రెస్టారెంట్లపై దాడులు నిర్వహిస్తూ క్వాలిటీ ఫుడ్‌ను ప్రజలకు అందించేలా జాగ్రత్తలు తీసుకోవాలి. అయితే నెలసరి ఠంచనుగా జీతం పుచ్చుకుంటున్న ఈ శాఖ అధికారులు ఆహార తనిఖీలను ఏనాడో మరిచిపోయారు. విధి నిర్వహణగా హోటళ్లలో ఆహార తనిఖీలను నిర్వహించాల్సిన ఆ శాఖ అధికారులు నిద్రమత్తులో జోగుతున్నారు. ప్రభుత్వ వేతనాలు సరిపోక నెలసరి బయటి మామాళ్లకు మరిగి ప్రజారోగ్యాన్ని గాలికి వదిలేశారు. ఫలితంగా రోడ్ల వెంట ఎలాంటి అనుమతులు లేకుండా వెలసిన చిన్న చిన్న హోటళ్లు కుప్పలు తెప్పలుగా మారాయి. ఆయా హోటళ్లలో ఆహారం తిని ఎవరైనా మృత్యువాత పడితే బాధ్యులెవరనే విషయమే ఇప్పుడు వారికి వారు ప్రశ్నించుకోవాల్సిన అంశం. ఎంత చెప్పినా నెలకు ఓ లకారం జీతం పుచ్చుకుంటున్న అధికారులు మాత్రం మారడం సాధ్యం కాని పని. అందుకే 'ఏడుకొండలు పేరు' లాంటి హోటళ్లలో నోట్లో ముద్ద పెట్టుకునేటప్పుడు ఒక్కసారి ఆలోచించడం మనవంతు కర్తవ్యంగా మారాల్సిన అవసరం ఉంది.

# పథకం వికాసం.. యువతకు వినాశం..

**ఏడాది దాటినా అందని రాజీవ్ యువ వికాసం నిధులు**
**అటకెక్కిన నిరుద్యోగుల ఆశలు**




ప్రజాపక్షం/నేలకొండపల్లి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకం నేడు అలంకారప్రాయంగా మారింది. పథకం ప్రకటించి ఏడాది దాటుతున్నా, క్షేత్రస్థాయిలో ఒక్క అడుగు కూడా ముందుకు పడకపోవడంతో నేలకొండపల్లి మండలంలోని నిరుద్యోగులు తీవ్ర నిరాశలో మునిగిపోయారు. 2025 జూన్ 2వ తేదీ నాటికి అర్హులైన లబ్ధిదారులకు నిధులు మంజూరు చేస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీ నీటి మూటగానే మిగిలిపోయింది.

### మండలంలో దరఖాస్తుల వెల్లువ

నేలకొండపల్లి మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల నుండి సుమారు వెయ్యి మందికి పైగా యువతీ యువకులు ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకున్నారు. కుటీర పరిశ్రమలు, చిన్న తరహా వ్యాపారాలు, జిరాక్స్ సెంటర్లు, మినీ డెయిరీ ఫామ్స్ వంటి యూనిట్ల ద్వారా ఉపాధి పొందుదామని ఆశపడ్డారు. దరఖాస్తుల కోసం వందలాది రూపాయలు ఖర్చు చేసి, కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. కానీ, నేటికీ ఆ దరఖాస్తుల పరిస్థితి ఏమైందో అధికారులకే తెలియని పరిస్థితి నెలకొంది.

### మొండిచేయి చూపిన బడ్జెట్

ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఈ పథకానికి నిధులు కేటాయించకపోవడం నిరుద్యోగుల ఆవేదనను రెట్టింపు చేసింది. గతంలో కేటాయించిన రూ. 6 వేల కోట్లు ఇతర పథకాలకు మళ్లించారనే ఆరోపణలు వస్తున్నాయి. దీనికి తోడు బ్యాంకు రుణాలకు సిబిల్ స్కోర్ నిబంధన విధిస్తారనే ప్రచారం గ్రామీణ యువతను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. సబ్సిడీ పోను మిగిలిన మొత్తాన్ని బ్యాంకుల నుండి పొందడం క్లిష్టంగా మారడంతో, ఈ పథకం అసలు అమలు అవుతుందా లేదా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

### యువజన సంఘాల ఆగ్రహం..

ప్రభుత్వాలు మారుతున్నా నిరుద్యోగుల తలరాతలు మారడం లేదని యువజన సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో బీసీ సబ్సిడీ రుణాలు ఎలాగైతే ప్రచారానికే పరిమితమయ్యాయో, ప్రస్తుత రాజీవ్ యువ వికాసం కూడా అదే బాటలో పయనిస్తోందని వారు మండిపడుతున్నారు. నిరుద్యోగుల అసహనం కట్టలు తెంచుకోకముందే ప్రభుత్వం స్పందించి, తక్షణమే మండలాల వారీగా నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

**ప్రభుత్వ తీరును ఖండిస్తున్నాం**



రాజీవ్ యువ వికాసం పథకం విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న మొండి వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నాం. నిరుద్యోగుల ఓట్లతో అధికారంలోకి వచ్చి, ఇప్పుడు ఉపాధి నిధులను పక్కదారి పట్టించడం దారుణం. పాలేరు నియోజకవర్గంతో పాటు నేలకొండపల్లి మండలంలోని వేలాది మంది నిరుద్యోగులు ఈ పథకంపై గంపెడు ఆశలు పెట్టుకున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మళ్లించిన రూ. 6 వేల కోట్లను ఈ పథకానికే కేటాయించాలి. లేనిపక్షంలో నిరుద్యోగులను ఏకం చేసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం.

**- మామిళ్ల శ్రీనాథ్ రెడ్డి, ఆల్ ఇండియా యూత్ ఫడరేషన్ (AIYF) పాలేరు నియోజకవర్గ కార్యదర్శి**

## దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర మహాసభలను జయపద్రం చేయాలి



ప్రజాపక్షం/బూర్గంపాడు: మండల పరిధిలోని సారపాకలోని సీపీఐ కార్యాలయంలో సిపిఐ సీనియర్ నాయకులు బర్ల వెంకటేశ్వర్లు అధ్యక్షతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి దళిత హక్కుల పోరాట సమితి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పేరాల శ్రీనివాసరావు, సీపీఐ మండల కార్యదర్శి సబ్కా నాగేశ్వరరావు హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఏప్రిల్ 17,18 తేదీల్లో వరంగల్‌లో జరగనున్న దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర రెండో మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈసందర్భంగా మహాసభల గోడ పత్రికలను విడుదల చేశారు. దళితులపై కొనసాగుతున్న అణచివేత, అంటరానితనం, వివక్షకు వ్యతిరేకంగా సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వం కోసం సమితి పని చేస్తోందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో సీపీఐ నాయకులు సిద్ధారపు సుబ్బారెడ్డి, శంకర్‌రెడ్డి, పాండవుల బిక్షం, ముదిగొండ బాలకృష్ణ, కరుటూరు రాము, తోకల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## గడువులోపు ఇందిరమ్మ ఇళ్లు పూర్తి చేయాలి



ప్రజాపక్షం/ కొత్తగూడెం : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యత పాటిస్తూనే వేగం పెంచాలని, ప్రభుత్వం నిబంధనల ప్రకారం గడువులోగా నిర్మాణాలూ పూర్తి చేసి అప్పగించాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. నియోజకవర్గ పరిధిలోని సుజాతనగర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్మాణాల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లేబర్ చార్జీలు ఎంత అవుతున్నాయి. లబ్దిదారులు ఎంత మొత్తంగా వెచ్చిస్తున్నారు అనే అంశాలపై సమగ్ర విచారణ చేశారు. ఈ క్రమంలో మూడ్ మౌనిక, హథిరామ్, భూక్య అమల, భూక్య సునీత, భూక్య పంతులీ తదితరులు ఇళ్లను పరిశీలించారు. గ్రామంలో 650 మంది జనాభా ఉండగా వారిలో అధిక సంఖ్యలో తాపీ మేస్త్రీలు ఉన్నారని, వారే స్వయంగా ఇళ్ల ను నిర్మించుకోవడం ద్వారా లేబర్ ఖర్చులు తగ్గించుకుంటూ నిర్మించుకోవడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట తహశిల్దార్ కృష్ణప్రసాద్, ఎంపిడిఓ భారతి, ఏఇ లాల్‌సాబ్, పంచాయితీ కార్యదర్శి విజయలక్ష్మీ , ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## న్యాయమూర్తి మండా జన్మదిన వేడుకలు



ప్రజాపక్షం/భద్రాచలం : ప్రముఖ న్యాయమూర్తి మండా వెంకటేశ్వరరావు జన్మదిన వేడుకలను చేతన మీసేవా ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. రంజిత్ నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అనాదాశ్రమం పిల్లలకు 25 కేజీల బియ్యం, అరటి పండ్లు అందజేశారు. చిన్నారులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం ఆశ్రమ నిర్వాహకులు మాట్లాడుతూ జడ్జీ మండా వెంకటేశ్వరరావు జన్మదిన వేడుకలు తమ మధ్య జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని, ఇందుకు మీసేవా నిర్వాహకులు ముందుకు రావడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో కొప్పుల మురళీ, అమ్మ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 18న ప్ర.డిగ్రీ కాలేజీలో జాబ్ మేళా

ప్రజాపక్షం/భద్రాచలం : స్థానిక ప్రభుత్వడిగ్రీ కాలేజీలో ఈనెల 18న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ జాన్ మిల్టన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కశాశాలలో కెరియర్ గైడెన్స్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ రసాయన శాస్త్ర విభాగం సంయుక్తంగా నిర్వహించే ఈ జాబ్ మేళాలో విజయా బయో ఫెర్టిలైజర్స్, శ్రీ అక్షయ హెచ్‌ఆర్ సర్వీసెస్ సంస్థల్లో ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని చెప్పారు. పూర్తి వివరాల కోసం 9989209575,9951590973,9640271748 నెంబర్లను సంప్రదించాలని ఆయన సూచించారు.

## గ్రంథాలయానికి అనుమతి పత్రం అందజేత



ప్రజాపక్షం/చంద్రుగొండ: చంద్రుగొండ మండల కేంద్రంలో కొత్త గ్రంథాలయ ఏర్పాటుకు కీలక అడుగు పడింది. సర్పంచ్ ఇస్లావత్ రుక్మిణి చేసిన వినతి మేరకు అధికారులు అనుమతి పత్రం అందజేశారు. ప్రభుత్వానికి చెందిన గవర్నమెంట్ ఆసుపత్రి సమీపంలోని స్థలంలో గ్రంథాలయం ఏర్పాటు చేయడానికి అనుమతి లభించింది. ఈ మేరకు గ్రంథాలయ అధికారులు బుధవారం సర్పంచ్ రుక్మిణికి అధికారిక పర్మిషన్ పత్రాలు అందించారు. ఏళ్లుగా ఎదురుచూస్తున్న గ్రంథాలయ ఏర్పాటుకు మార్గం సుగమం కావడంతో ప్రజల కల నెరవేరిందని సర్పంచ్ తెలిపారు. ఈసందర్భంగా గ్రంథాలయ అధికారులకు, జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ పసుపులేటి వీరబాబు, అశ్వారావుపేట ఎంఎల్‌ఏ జారే ఆదినారాయణలకు కృతజ్ఞతలు తెలిపారు.

# గ్రామాల అభివృద్ధితో జీవన ప్రమాణాలు పెంపే లక్ష్యం

ప్రజాపక్షం/కల్లూరుః గ్రామాల అభివృద్ధితో ప్రజల జీవన ప్రమాణాలు పెంపే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర డిప్యూటీ ముఖ్య మంత్రి బట్టి మల్లు విక్రమార్క అన్నారు. బుధవారం కల్లూరు లో రూ.10.50 కోట్లతో నిర్మించిన కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను ప్రారంభించారు. అనంతరం నారాయణపురంలో రూ. 2.75 కోట్లతో 33/ 11 కెవి విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన ఏర్పాటు చేసిన సభలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధితో ప్రజల జీవన ప్రమాణాలు పెంపు లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. బుధవారం రాష్ట్ర రెవెన్యూ సమాచార గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎన్‌పిసిడియ ల్ సిఎండి వరుణ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అనుదీప్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టారాగమయి లతో కలిసి ప్రారంభించిన అనంతరం వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో మౌలిక సదుపాయాలు లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. ప్రతి గ్రామానికి నాణ్యమైన విద్యుత్తు వైద్య సేవలో మౌలిక వసతులు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నామని పేర్కొన్నారు. కల్లూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ద్వారా కల్లూరు, తల్లాడ, పెనుబల్లి మండలాల పరిసర గ్రామాల కు చెందిన ప్రజలు కు మెరుగైన వైద్య సేవలు అందుతాయని రాష్ట్రంలోని ప్రతి వ్యక్తికి వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొచ్చే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు వెళుతుందని వివరించారు. ఈ ప్రాంతంలో మెరుగైన వైద్య



సేవలు అందించడంలో ఈ ఆసుపత్రి కీలకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఇది ప్రజా ప్రభుత్వమని, విద్య, వైద్య, అనేక రంగాలలో అభివృద్ధికి అనేక రంగాలలో ప్రాధాన్యతనిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, హస్త కళల సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ విద్యుత్ శాఖ ఎస్ ఈ శ్రీనివాస చారి, డి సి హెచ్ ఎస్ డాక్టర్ రాజశేఖర్, వైద్యులు రమేష్, విద్యుత్ శాఖ అధికారులు మహేంద్ర కుమార్, అఫ్జల్ ఆసిఫ్, మున్సిపాలిటీ చైర్మన్ మోహన్ నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ నీరజాదేవి, పసుమర్తి చంద్రరావు, మున్సిపాలిటీ మేనేజర్ నాగేశ్వర రావు, పలు శాఖల అధికారులు సంబంధిత శాఖల అధికారులు ప్రజా ప్రతినిధులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత.. సామాజిక బాధ్యత

**-అడిషనల్ డీజీ సంజయ్ కుమార్ జైన్**

ప్రజాపక్షం/ఖమ్మం క్రైం : రోడ్డు భద్రత సామాజిక బాధ్యతగా గుర్తించాలని అడిషనల్ డీజీ సంజయ్‌కుమార్ జైన్ అన్నారు. ప్రజాపలనాప్రగతి ప్రణాళిక లో భాగంగా బుధవారం స్థానిక ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో పోలీసు కమిషనర్ సునిల్‌దత్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రోడ్డుభద్రతను అందరూ బాధ్యతగా తీసుకుంటే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చన్నారు. ఇందుకు తల్లిదండ్రులతో పాటు విద్యాసంస్థల్లో ఉపాధ్యాయులు ట్రాఫిక్ రూల్స్ గురించి పిల్లలకు తెలియజేయాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం వలన కలిగే అనర్థాలను వివరించాలన్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించడం, హెల్మెట్ ధరించడం సీటు బెల్ట్ పెట్టుకోవడం వలన కలిగే ప్రయోజనాలను తెలియజేయాలన్నారు. మద్యంసేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ, అతివేగంగా వాహనాలు నడుపడం వలన కలిగే అనార్ధలను తెలియజేయాలన్నారు. నిబంధనలు సక్రమంగా పాటిస్తే రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చన్నారు. యుద్దాలు, నేరాలలో మరణించే వారికంటే రోడ్డు ప్రమాదాలలో మరణిస్తున్న వారు ఎక్కువగా ఉన్నారన్నారు. ప్రతి ఏడాది రోడ్డు ప్రమాదాలలో 1.8 లక్షల మంది ప్రాణాలు కోల్పోతుండగా ప్రతి నిమిషానికి ఒక ప్రమాదం, ప్రతి మూడు నిముషాలకు ఒకరు మృతిచెందు





తున్నారని వీరిలో 1845 సంవత్సరాలలోపు వారే అని నివేదికలు తెలుపుతున్నాయన్నారు. విదేశాల్లో ట్రాఫిక్ రూల్స్ పాటించకుంటే కఠినమైన చర్యలతో పాటు జరిమానాలు విధిస్తుంటారని తెలిపారు. అనంతరం పోలీసు కమిషనర్ సునిల్‌దత్ మాట్లాడుతూ చిన్న నిర్లక్ష్యం నిండుప్రాణాలను బలితీసుకుంటుందన్నారు. ఫలితంగా కుటుంబాలు దిక్కులేని స్థితిలో ఉంటాయని అవి ఊహించడం సాధ్యంకాదన్నారు. మానసిక వేదనతో కుటుంబాలు దీనంగా మారతాయని వీటిని దృష్టిలో ఉంచుకుని తల్లిదండ్రులు పిల్లలకు ట్రాఫిక్ రైల్స్ కఠినంగా పాటించాలని చెప్పవలసిన బాధ్యత వారిపై ఉందన్నారు. ఈసందర్భంగా విద్యార్థులతో రోడ్డు భద్రత నిబంధనలు కచ్చితంగా పాటిస్తామని, హెల్మెట్, సీటు బెల్ట్ ధరిస్తామని, మద్యంసేవించిగాని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ కాని వాహనాలు నడపమని ప్రతిజ్ఞా చేయించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపి లాఅం డ్ఆడర్ ప్రసాద్‌రావు, ఆర్టీవో రాజశేఖర్, ఏసిపిలు రమణమూర్తి, మహేష్, శ్రీనివాసులు, సర్వర్, సిఐలు భానుప్రకాశ్, కరుణాకర్, బాలకృష్ణ, మోహన్‌బాబు, రాజిరెడ్డి, సత్యనారాయణ, అప్పలనాయుడు పాల్గొన్నారు.

# జావిద్ మృతి పట్ల ఐజెయు సంతాపం

**-ఆత్మీయ మిత్రున్ని కోల్పోయాం : రాంనారాయణ**

ప్రజాపక్షం/ ఖమ్మం : సీనియర్ కాంగ్రెస్ నాయకులు, నగర మాజీ అధ్యక్షులు మహ్మద్ జావిద్ మృతి పట్ల టియుడబ్ల్యుజె (ఐజెయు) తీవ్ర సంతాపాన్ని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది. ఆయన మరణం కాంగ్రెస్ పార్టీకి, సామాన్య ప్రజలకు తీరని లోటన్నారు. ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ మాట్లాడుతూ జావిద్ మృతితో ఒక ఆత్మీయ మిత్రున్ని కోల్పోయామన్నారు. జర్నలిస్టుల మిత్రునిగా పేరొందిన జావిద్ అకాల మరణం పట్ల ఐజెయు రాష్ట్ర కమిటీ తీవ్ర సంతాపాన్ని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తుందన్నారు. సంతాపం తెలిపిన వారిలో యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాటేటి వేణుగోపాల్, జాతీయ కౌన్సిల్ సభ్యులు నలజాల వెంకట్రావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సామినేని మురారి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏనుగు వెంకటేశ్వరరావు, మైసా పాపారావు, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష, కార్యదర్శులు మామిడాల భూపాల్, మహేందర్, జర్నలిస్ట్ హౌజింగ్ సొసైటీ అధ్యక్షులు కనకం సైదులు, నగర అధ్యక్ష, కార్యదర్శులు చెరుకుపల్లి శ్రీనివాస్, జనార్థనాచారి, నాయకులు మోహినుద్దీన్, మాధవరావు, వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.

# గురుకుల కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాపక్షం/కల్లూరుః తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ 202627 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశానికి ఈ నెల ఆరో తేదీ నుండి 2 5వ తేదీ వరకు ఆన్లైన్లో దరఖాస్తులు స్వీకరిస్తున్నామని కల్లూరు గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ కనకదుర్గ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంవత్సరం 10వ తరగతి పరీక్షలకు హాజరైన విద్యార్థిని విద్యార్థులు ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకోవచ్చని వారు పేర్కొన్నారు. కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ లో సెలెక్ట్ అయిన అభ్యర్థులకు సి ఓ ఈ వృత్తి విద్యలు సైనిక కళాశాలలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అంతేగాక జూనియర్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సిఇసి ,హెచ్ఈసి, మొదలైన గ్రూపులలో ప్రవేశం పొందవచ్చు అని తెలిపారు. పూర్తి వివరాలకు సమీపంలోని గురుకుల కళాశాలలో సంప్రదించవచ్చని కల్లూరు ప్రిన్సిపల్ కనకదుర్గ తెలిపారు.



# నూతన సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన

ప్రజాపక్షం/ మధిర : మండలంలోని మాటూరు గ్రామంలో ఎంపి నిధులు రూ.5లక్షలతో చేపట్టనున్న నూతన సిసి రోడ్డు నిర్మాణ పనులకు బుధవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు డాక్టర్ కోట రాంబాబు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మట్టి రోడ్లుగా ఉన్న అంతర్గత రహదారులను సిసి రోడ్లుగా మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులను కేటాయిస్తుందని అన్నారు. అదేవిధంగా మధిర నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేస్తున్న డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రంలో టెలికం అడ్వైజరీ కమిటీ మెంబర్ అమరవాది సత్యనారాయణరెడ్డి, కపిలవాయి సత్యనారాయణరాజు, మాజీ ఎంపిపి ఎర్రగుంట లక్ష్మీ రమేష్, గ్రామ సర్పంచ్ రాయబరపు పుల్లారావు, మేడిశెట్టి ఎర్ర నాగేశ్వరరావు,రాయబారపు పుల్లయ్య, కాశీ కోటేశ్వరరావు, సోమ రవికాంత్, గ్రామ వార్డు సభ్యులు తదితరుల పాల్గొన్నారు.



# 8వ రోజుకు చేరిన విద్యుత్ కార్మికుల సమ్మె

ప్రజాపక్షం/ మధిర : విద్యుత్ శాఖలో సుదీర్ఘకాలం నుండి కనీస వేతనాలు కూడా లేకుండా పనిచేస్తున్న సబ్‌స్టేషన్ ఆపరేటర్స్, కంప్యూటర్ ఆపరేటర్స్, ఆఫీస్ అసిస్టెంట్ వాచ్మెన్‌గా వివిధ రూపాల్లో పని చేస్తున్న ఆర్టిజన్స్, అన్‌మ్యాన్, పీస్ రేట్ కార్మికులు వారి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేస్తున్న నిరవధిక సమ్మె బుధవారం 8వరోజుకుచేరుకుంది. మధిర విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయ ప్రాంగణంలో బయట ఏర్పాటు చేసిన శిబిరంలో విధులు బహిష్కరించి నిరవధిక సమ్మె కొనసాగించారు. ఈ రోజు సమ్మె చేస్తున్న ఆర్టిజన్స్, అన్మాండ్ కార్మికులకు మద్దతుగా విద్యుత్ శాఖలో ప్రధాన గ్రేడ్ యూనియన్స్ 327యూనియన్, 1104 యూనియన్ ప్రధాన బాధ్యులు వచ్చి సంఘీభావం తెలిపారు. యాజమాన్యం కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు నిరవధిక సమ్మె కొనసాగిస్తున్నామని వారు తెలిపారు.



# జావిద్ మృతి పార్టీకి తీరనిలోటు : కట్ల

ప్రజాపక్షం/వైరా : సూర్యాపేటవద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రదేశ్ కాంగ్రెస్ కమిటి సభ్యులు ఖమ్మం పట్టణ కార్పోరేషన్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు మహమ్మద్ జావేద్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందటం బాధాకరమైన విషయం అని ఆయ మృతి కాంగ్రేస్‌పార్టీకి తీరని లోటని వైరా మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ ఒక ప్రకటనద్వారా సంతాపం తెలియజేశారు. కాంగ్రేస్ పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు 7 సంవత్సరాలు ఖమ్మం నగర కాంగ్రేస్ పార్టీ అధ్యక్షుడిగా వ్యవహరించి అప్పటి కేంద్రంలో బిజెపి ప్రభుత్వం రాష్ట్రంలో టిఆర్ఎస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడి కాంగ్రేస్ పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పడు అందుబాటులో ఉండి పార్టీ అభివృద్ధికోసం కృషిచేసిన వ్యక్తి అని ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢసానుభూతి తెలియజేశారు.



# ప్రజా సమస్యలకు తక్షణమే పరిష్కార మార్గం

ప్రజాపక్షం/ మధిర : ప్రజా సమస్యలు తక్షణ పరిష్కారమే లక్ష్యంగా మధిర మున్సిపాలిటీ నూతన పాలకవర్గం పనిచేస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత స్పష్టం చేశారు. మధిర ట్యాంక్ బండ్‌పై పేరుకుపోయిన చెత్త, పారిశుద్ధ్యం, రోడ్ల మరమ్మత్తులు, విద్యుత్ దీపాల సమస్యల పట్ల దృష్టి సారించిన చైర్‌పర్సన్ సుజాత ఆ వార్డు కౌన్సిలర్ రేవతితో కలిసి బుధవారం పనులు ప్రారంభించారు. ఈ మేరకు కార్మికులు ట్యాంక్ బండ్‌పై దీపాలు, పగిలిపోయిన రోడ్లు మరమ్మత్తులను పూర్తి చేసి కంపచెట్లను తొలగించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ సుజాత మాట్లాడుతూ మధిర ట్యాంక్ బండ్‌కు వచ్చే ప్రజలకు మంచి వాతావరణం, ఆరోగ్యకరమైన జీవనశైలిని అందించడానికి పచ్చదనం పెంపు వంటి కార్యక్రమాలు త్వరలో చేపడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, ఎలక్ట్రిషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# సిబిఎస్ఇ ఫలితాల్లో సెయింట్ ఫ్రాన్సిస్ ప్రభంజనం

ప్రజాపక్షం/ మధిర : 2026 సిబిఎస్ఇ పదవ తరగతి ఫలితాల్లో సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్ ప్రభంజనం సృష్టించింది. దేశవ్యాప్తంగా బుధవారం విడుదలైన ఫలితాల్లో స్కూల్‌కు చెందిన కందూరి ఆదిత్యశౌరి అత్యుత్తమ ప్రతిభ కనబర్చి 491/500 మార్కులతో ఖమ్మంలో జిల్లాలో సెకండ్ ర్యాంక్ సాధించినట్లు స్కూల్ కరస్పాండెంట్ సిస్టర్ మేరీథామస్, ప్రిన్సిపాల్ సిస్టర్ ఆన్‌బీబీ తెలిపారు. అదేవిధంగా సాయిచంద్రవర్ధన్ 473, షైనీ 470, అభిషేక్ 470 మార్కులతో జాతీయస్థాయిలో నిలిచినట్లు తెలిపారు. సిబిఎస్ఇలో ప్రతిభ చాటిన విద్యార్థులను వీరితో పాటు వైస్‌ప్రిన్సిపాల్ సిస్టర్ జ్యోతి, ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.



# ఆదరణసేవా ఫౌండేషన్‌లో అనాధలకు అన్నదానం

ప్రజాపక్షం/ మధిర : మధిరలోని ఆదరణ సేవా ఫౌండేషన్ నందు బుధవారం అమరా జనార్ధన్ రావు తిథి సందర్భంగా వారికుమారుడు అమరా శ్యామ్ ఆధ్వర్యంలో అనాధలకు అన్నదానం, పురుషులకు టీషర్టులు అందచేశారు. ఈ కార్యక్రమంలో వాణి ట్రేడర్స్ అధినేత నాళ్ళ శ్రీనివాస రావు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ కూడా ఏదో ఒక సందర్భంగా అనాధలకు అన్నదానాలు, పలు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ప్రతిఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకుని ఎదుటి వారికి తమకు తోచిన విధంగా సహాయం చేయాలని కోరారు. ఈక ఆర్యక్రమంలో నాళ్ళ జీవన్, మధిర ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జివి, అరుణ్, కోశాధికారి కాకరపర్తి శ్రీనివాస రావు, ఉపకోశాధికారి శ్రీధర్, ప్రచార కార్యదర్శి అర్జున్, సహాయ కార్యదర్శి మహాకాళి శ్రీనివాసరావు, వాసు, పసుపులేటి శ్రీనివాసరావు, సేవా ఫౌండేషన్ నిర్వాహకులు నిస్సి హరిణి తదితరులు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై ఎంఎల్ఏ సమీక్ష

**-అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు అందిస్తాం**
**-ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు**



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** పినపాక నియోజకవర్గంలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిపై ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు సమీక్ష సమావేశం నిర్వహించారు. బూర్గంపాడు మండలం సారపాకలోకి వాసవి ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ సమావేశంలో ఏడు మండలాలకు చెందిన అధికారులతో కలిసి పనుల స్థితిగతులను విశ్లేషించారు. ప్రతి మండలంలో పూర్తయిన, నిర్మాణంలో ఉన్న, ఇంకా పెండింగ్‌లో ఉన్న ఇళ్ల వివరాలను పరిశీలించి, ఆలస్యం జరుగుతున్న ప్రాంతాల్లో వెంటనే చర్యలు తీసుకుని పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే సహించబోమని స్పష్టం చేశారు. ప్రతి అర్హ కుటుంబానికి ఇల్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు సమన్వయంతో పని చేసి పనులను సమయానికి పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, హౌసింగ్ ఏఈలు, ఇతర శాఖల అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన..




**ప్రజాపక్షం/జూలూరుపాడు:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మంగా తీసుకున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి నివేదికలు భాగంగా బుధవారం రోడ్డు భద్రత ,ప్రమాదాల నివారణలో తీసుకోవలసిన జాగ్రత్త పై స్థానిక ఉన్నత పాఠశాల జూలూరుపాడు నందు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు టి .లక్ష్మీ నరసయ్య అధ్యక్షతన విద్యార్థినీ విద్యార్థులకు మరియు గ్రామ ప్రజలకు రోడ్డు భద్రత ప్రమాదాలు నివారణ పై అవగాహన సదస్సును నిర్వహించడం జరిగింది. ర్యాలీలో పాల్గొని మానవహారము నిర్వహించడం జరిగినది. ఈ అవగాహన సదస్సులో స్థానిక తహసిల్దార్ టి శ్రీనివాస్ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులు కనుక మీకు మీ తల్లి దండ్రులకు మీ బంధు మిత్రులందరికీ కూడా ఈ ట్రాఫిక్ నిబంధనల పైన, రోడ్డు భద్రతపై తీసుకోవలసిన జాగ్రత్తలు మీద అవగాహన కల్పించాలని తహశీల్దార్ పిల్లలు ఉద్దేశించి మాట్లాడటం జరిగినది. జూలూరుపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ డి .శ్రీ లక్ష్మీ మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు బాల బాలికలు గానీ యువతీ యువకుల గాని ఎవరైనా 18 సంవత్సరాలు వయసు లేకుండా, లైసెన్సు లేకుండా వాహనములు నడుపుటకు అర్హత లేదని, అర్హత లేని వారు డ్రైవింగ్ చేయకూడదని అలా ఎవరైనా అర్హత లేని వారు డ్రైవింగ్ చేసినట్లయితే చట్టారీత్యా చర్యలు తీసుకోబడునని తెలిపారు. ఈ కార్యక్రమంలో జూలూరుపాడు ఎంపీడీవో తాలూరి రవి , స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ బి రవి,విద్యాశాఖ అధికారి బి. జంకిలాల్, గ్రామ పంచాయతీ సెక్రెటరీ షేక్ ఖాదర్ మియా, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# "అరైవ్ అలైవ్"తో రోడ్డు భద్రతపై విద్యార్థుల్లో చైతన్యం



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన"అరైవ్ అలైవ్"కార్యక్రమంలో భాగంగా బూర్గంపాడు మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక సర్పంచ్ మందా నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పాల్గొని రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేశారు. ఈసందర్భంగా ఎస్ఐ మేడ ప్రసాద్ మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాలను ప్రతి ఒక్కరూ తప్పని సరిగా పాటించాలని సూచించారు. లైసెన్స్, వాహనపత్రాలు లేకుండా వాహనాలు నడపరాదని హెచ్చరించారు. విద్యార్థులు తమ కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలకు కూడా రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలని కోరారు. "అరైవ్ అలైవ్"అంటే సురక్షితంగా ప్రయాణించి ఇంటికి సురక్షితంగా చేరుకోవడం అనే భావన అని వివరించారు. కార్యక్రమంలో భాగంగా వాహనదారులను నిలిపి పత్రాలను తనిఖీ చేశారు. అనంతరం ఎంపీడీవో జమలారెడ్డి మాట్లాడుతూ ప్రజలందరూ రోడ్డు భద్రత నియమాలు పాటించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని, ఇటువంటి అవగాహన కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంఈవో, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక నాయకులు, వివిధ శాఖల సిబ్బంది, పాల్గొన్నారు.

# నిర్లక్ష్యానికి నిదర్శనం.. తహశీల్ధార్ కార్యాలయం..!

**-ధృవీకరణ పత్రాల మంజూరులో జాప్యం**
**-దరఖాస్తు చేస్తే కార్యాలయం చుట్టూ తిరగాల్సిందే..**




**ప్రజాపక్షం/బోనకల్ :** మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఉద్యోగులు, సిబ్బంది నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా దర్శనమిస్తున్నారు. కుల, ఆదాయ, నివాస తదితర ధృవీకరణ పత్రాల మంజూరు ఉద్యోగులు తీవ్ర జాప్యం చేస్తున్నారు. దరఖాస్తు చేసిన నాటి నుండి విద్యార్థులు, వృద్ధులు కార్యాలయం చుట్టూ ప్రదక్షణలు చేయాల్సిన పరిస్థితి దాపురించిదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు తీవ్ర ఎండల వల్ల కార్యాలయానికి వచ్చివెళ్లడానికి వ్యయప్రయాసలు పడాల్సి వస్తుందని మండల ప్రజలు వాపోతున్నారు. కార్యాలయం వద్ద కనీస త్రాగునీరు ఏర్పాటు చేయకపోవడం వల్ల దాహం తీర్చుకోవడానికి ప్రతి సారి ప్రధాన కూడళ్లకు రావాల్సి వస్తుందంటున్నారు. ఇటీవల విద్యార్థుల తల్లిదండ్రులు కేంద్రీయ విద్యాలయానికి దరఖాస్తుల్లో భాగంగా తహసీల్దార్ కార్యాలయంలో కుల ధృవీకరణ దరఖాస్తు చేయడం జరిగింది. సకాలంలో ధృవీకరణ పత్రాన్ని మంజూరు చేయాలని ప్రాధేయ పడ్డ ఫలితం దక్కలేదు. కొన్ని సార్లు సాంకేతిక సమస్య అని, మరోసారి అధికారులు అందుబాటులో లేరని సాకులు చెబుతూ ప్రజలను నానా అవస్థలు గురి చేస్తున్నారు. కొంత సొమ్మును ముట్టజెబితే మాత్రం ఒక్కరోజులోనే ధృవీకరణ పత్రాలను మంజూరు చేయడం మాత్రం విడ్డూరంగా ఉంటుంది. ఇటీవల ఓ పాత్రికేయుడు కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలకు దరఖాస్తు చేసుకొని అధికారులకు విన్నవించి నేటికి వారాలు గడుస్తున్నా మంజూరులో మాత్రం ఏ కదలిక లేదు. ఇక్కడి అధికారులు పైసలకే పనులు చేస్తున్నారనేది ఏమాత్రం ఆరోపణ కాదని మండల ప్రజలు ముక్తకంఠంతో తెలియజేస్తున్నారు. అనేకమార్లు పత్రికల్లో కథనాలు వచ్చినప్పటికీ అధికారులు తీరు మాత్రం మారకపోవడంపై మండల ప్రజలు ముక్కున వేలు వేసుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు తీరు మార్చుకొని ప్రజలను ఇబ్బందులకు గురి చేయకుండా సకాలంలో ధృవీకరణ పత్రాలు మంజూరు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# రహదారుల భద్రత మనందరి బాధ్యత

**- రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన**
**- కార్యక్రమాన్ని ప్రారంభించిన కలెక్టర్**



**ప్రజాపక్షం/ కొత్తగూడెం :** రహదారు భద్రత మనందరి బాధ్యతని, ప్రమాదాల నివారణకు అంతా కృషి చేయాలని కలెక్టర్ అంకిత్ అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా బుధవారం కొత్తగూడెం హనుమాన్ బస్తీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీని కలెక్టర్ ఘనంగా ప్రారంభించారు. అనంతరం ఆయన విద్యార్థులతో భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. చిన్నవయస్సులోనే ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంచుకుంటే భవిష్యత్‌లో బాధ్యతాయుత పౌరులుగా ఎదిగేందుకు దోహతపడుతుందని తెలిపారు. తమ వారు వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ పెట్టుకోవాలని, సీటు బెల్టు ధరించాలని చెప్పాలని, ట్రాఫిక్ సిగ్నల్, జీబ్రా క్రాసింగ్ వినియోగం, రోడ్డు నియమాల పాటింపు వంటి అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల కాణంగా అనేక కుటుంబాలు తీవ్రమైన నష్టాన్ని చూస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ మధురవాణి, ప్రధానోపాధ్యాయులు లక్ష్మీ, కో ఆర్డినేటర్ నాగశేఖర శర్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# భద్రాద్రి కొత్తగూడెం జిల్లా తుడుం దెబ్బ నూతన కమిటీలో కరకగూడెం నాయకత్వం



**ప్రజాపక్షం/కరకగూడెం:** డా. బిఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని హక్కుల సంరక్షలో భాగంగా మహనీయులను స్మరించుకుంటూ పాల్వంచ పట్టణ కేంద్రంగా కొమరం భీమ్ భవనం నందు తుడుందెబ్బ జాతీయ రాష్ట్ర నాయకత్వం సమక్షంలో భద్రాద్రి జిల్లా తుడుందెబ్బ నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. ఈ భద్రాద్రి జిల్లా నూతన కమిటీ ఎన్నికలో కరకగూడెం మండల నాయకత్వం నుండి జిల్లా కమిటీలో భద్రాద్రి జిల్లా తుడుం దెబ్బ ప్రధాన కార్యదర్శి గా పోలెబోయిన వెంకటనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ గా కలం వేణుగోపాల్, ప్రచార కార్యదర్శి గా సుతారి నాగేశ్వరరావు, ఏపీస్ యూ ఉపాధ్యక్షులు గా ఇర్ప నాగకృష్ణ ఎన్నిక కావడం జరిగింది.

# ఆరోగ్యవంతమైన కూరగాయల సాగు చేసుకోవాలి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** ఆరోగ్యవంతమైన కూరగాయల సాగు చేసుకోవాలని నేలకొండపల్లి మండల వ్యవసాయాధికారి యం. రాధ సూచించారు. మండల కేంద్రం లోని రైతు వేదిక లో బుధవారం రైతులకు నూరు శాతం రాయితీ కూరగాయల విత్తనాల మిని కిట్స్ ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రైతులు వ్యవసాయం సాగులో భాగంగా కూరగాయాల సాగు ను ప్రోత్సాహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందించే విత్తనాలతో ఎలాంటి మందులు పిచికారి చేయకుండా సేంద్రియంతో కూరగాయలు పండించాలని సూచించారు. ఆకు కూరలను ఎక్కువగా సాగు చేసుకోవాలని సూచించారు. మండలం లోని రైతాంగం కు దాదాపు 200 మినీ కిట్స్ ను అందించినట్లు తెలిపారు. కావాల్సిన రైతులు వ్యవసాయ కార్యాలయం లో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ విస్తీర్ణాధికారి పి.వెంకట లక్ష్మి , రైతులు పాల్గొన్నారు.

# సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన సర్పంచ్



**ప్రజాపక్షం/పినపాక:** మండలంలోని వెంకట్రావ్ పేట గ్రామ పంచాయితీ గ్రామంలో సీసీ రోడ్డు పనులకు సర్పంచ్ సుతారి సింధూజ భూమి పూజ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాన్ని అన్ని రంగాల్లో తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని, వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను నివారించేందుకు పరిష్కరిస్తామన్నారు. స్థానిక ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లుకి ఈ సందర్భంగా గ్రామ ప్రజలు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ మాటూరి రవీందర్, గౌరారపు హరీష్, గ్రామ సెక్రటరీ, తదితరులు, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పందుల ఫామ్‌పై మూడో నోటీసు



**ప్రజాపక్షం/కారేపల్లి:** గుంపెల్లగూడెం గ్రామంలో కొనసాగుతున్న పందుల ఫామ్ హౌస్‌పై అధికారులు మూడోసారి నోటీసు జారీ చేశారు. ఫామ్ కారణంగా గ్రామంలో దుర్వాసన, అస్వచ్ఛత పెరిగి ప్రజలు అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు ఫిర్యాదులు అందడంతో సర్పంచ్ కృష్ణవేణి, పంచాయితీ సెక్రటరీ, ఉప సర్పంచ్ శంకర్ కలిసి ఫామ్ యజమానికి మూడోసారి నోటీసులు అందజేశారు. అయినప్పటికీ యజమాని ఎలాంటి స్పందన చూపకపోవడం, అధికారుల హెచ్చరికలను పట్టించుకోకపోవడంతో గ్రామ ప్రజల్లో ఆగ్రహాన్ని మరింత పెంచుతోంది. మా ఆరోగ్యంతో ఆటలాడుతున్న ఈ ఫామ్‌ను వెంటనే మూసి వేయాలి, లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని అంటూ గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు కఠిన చర్యలు తీసుకుని ఫామ్ హౌస్‌ను తక్షణమే మూసివేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే పరిస్థితి ఉద్రిక్తంగా మారే అవకాశముందని స్పష్టం చేస్తున్నారు.

# రామదాసు కట్టడాలకు ఆంటకం కలగకుండా చూడాలి

**- రామాలయాభివృద్ధి పనులు శాస్త్రోక్తంగా సాగాలి**
**- నెలాఖరు నాటికి టెండర్ ప్రక్రియ పూర్తి చేయండి**
**- రూ.351 కోట్ల పనులను యుద్ధ ప్రాతిపదికన మొదలు పెట్టాలి : మంత్రి పొంగులేటి**



**ప్రజాపక్షం/భద్రాచలం :** భక్త రామదాసు నిర్మించిన కట్టడాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శ్రీ సీతారామ చంద్ర స్వామి ఆలయ అభివృద్ధి పనులపై ఆయన మంగళవారం ఆలయ పరిసరాలను పరిశీ లించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆలయ చారిత్రక ఆధ్యాత్మిక ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుని రామదాసు కట్టడాల సమర క్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పనులు చేయాలని తెలిపారు. రామాలయం అభివృద్ధి తొలి దశ పనుల్లో భాగంగా రూ.351 కోట్ల పనులకు వెంటనే టెండర్లు పిలిచి ఆ ప్రక్రియను నెలాఖరు నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆలయ నూతన నామూనాను పరిశీలించిన ఆయన శాస్త్రో క్తంగా నిర్మాణాలు సాగాలని తెలిపారు. ఆర్కిటెక్ట్ ఇంజనీర్లు అవసరాన్ని బట్టి ఇక్కడ కార్యాలయాన్ని సిద్ధం చేసుకోవాలని, అధిక శాతం రాయి, మెటిల్ పరికరాలతో కట్టడాలు నిర్మించేందుకు ప్రాధాన్యత ఇవ్వాల న్నారు. భద్రాచలం రామాలయాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇందులో భాగంగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రీరామ నవమి నాడు పనులకు భూమి పూజా చేశారని చెప్పారు. భద్రాచలం రామాలయం దేశంలోనే అగ్రగామి ఆలయంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వంసిద్ధంగా ఉందని, ఆలయాభివృద్ధిలో భాగంగా రహదార్లతో పాటు పలు రకాల సదుపాయాలు కల్పించి అధిక సంఖ్యలో భక్తులు ఇక్కడికి తరలివచ్చేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అలయాభివృద్ధి పనుల్లో భాగంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, గోదావరి పుష్కరాల నాటికి తొలిదశ అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు రాత్రింబవళ్లు పనులు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మంత్రి వెంట భద్రాచలం, పినపాక ఎంఎల్ఏలు డా.తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, దేవాదాయాధర్మాదాయ శాఖ కమీషనర్ హన్మం తరావు, ఐటిడిఏ పిఓ రాహుల్, సబ్ కలెక్టర్ మ్రినాళ్ శ్రేష్ట, దేవస్థానం ఇఓ దామోదర్ రావు, ఆర్కిటెక్ట్ సూర్యనారాయణ, ఆలయ అస్థాన పండితులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్ఐఎ నోటీస్‌ను ఉపసంహరించుకోవాలి

**-సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ కేంద్ర కమిటీ సహాయ కార్యదర్శి, రాష్ట్ర కమిటీ కార్యదర్శి పోటు రంగారావు పై నేష నల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ) పెట్టిన దేశ ద్రోహం, ఉపా తదితర కుట్ర కేసులను వెంటనే ఎత్తివేయాని సిపిఐ (ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు ఆవుల అశోక్, జి. రామయ్య లు డిమాండ్ చేశారు. పోటు రంగారావుపై పెట్టిన అక్రమ కేసులను ఎన్ఐఏ నోటీస్‌లను తక్షణమే ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేస్తూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పెవిలియన్ మైదానం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు నిరసన ర్యాలీని నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి, ఆర్ఎస్ఎస్ కేంద్ర ప్రభుత్వ అధినేతలైన అమిత్‌షా, మోడీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల మీద, దేశ సంపదను అదానీ, అంబానీలకు దోచిపెడుతూ వాటిని ప్రశ్నించే వారిపై దేశద్రోహం, ఉపా, అక్రమ ఆయుధాలు కలిగి ఉన్నారని ఎటువంటి ఆధారాలు లేకుండానే కుట్ర కేసులు పెడుతూ నోటీసులు ఇస్తున్నారని ఆరోపించారు. ప్రొ॥ సాయిబాబా, వరవర రావు, జెఎన్‌యు యూనివర్సిటీ నాయకులు ఉమర్ ఖలీద్, హరిగో పాల్, విమలక్క, గాదె ఈనయ్య తదితరుల మీద కూడా తీవ్రవాద కార్యకలాపాల నిరోధక చట్టం, దేశద్రోహం కేసులను మోపిందని తర్వాత వాటిని ఎత్తివేసిందన్నారు. పోటు రంగారావు 50 ఏళ్ల నుండి విప్లవోద్యమంలో, పిడిఎస్‌యు, పివైఎల్ వంటి యువజన సంఘాలలో సిపిఐ(ఎంఎల్) ప్రజాపంథా, మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యంలో సుదీర్ఘ కాలం పాటు పోరాటాల్లో పాల్గొన్నారన్నారు. ప్రజా సమస్యల మీద పోరాడుతున్నందుకు కేంద్ర ప్రభుత్వం తప్పుడు ఆరోపణలు చేస్తూ నోటీసులు జారీ చేసిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అక్రమంగా పెట్టిన కేసులతో పాటు నోటీసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని తెలిపారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామ న్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సివై పుల్లయ్య, ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ శిరోమణి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్. శివలింగం, బందెల వెంకయ్య, ఎ. వెంకటరెడ్డి, మలీదు నాగేశ్వరరావు, కె. నాగేశ్వరరావు, ఝాన్సీ, హన్మంతరావు, శ్రీనివాసరావు, శోభ, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

**-ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి**



**ప్రజాపక్షం/కూసుమంచి:** ప్రతీ వాహనదా రుడు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి అన్నారు. అరైవ్, అలైవ్ కార్యక్రమంలో భాగంగా బుధ వారం మండల కేంద్రంలోని గ్లోబల్ రెయిన్ బో స్కూల్, జేవీఆర్ కళాశాలలో అరైవ్, అలైవ్ కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ స్కూల్ బస్సులో సురక్షితంగా ఎక్కడం, దిగడం ఎలా, వరుసలో నిలబడాలని, తోపులాటలు మానుకో వాలని, బస్సు పూర్తిగా ఆగే వరకు వేచి ఉండా లని, ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు చేతి పట్టుల ను(హ్యాండ్ రైల్స్‌ను)ఉపయోగించాలని, కదు లుతున్న బస్సు నుండి ఎప్పుడూ దిగడానికి ప్రయత్నించవద్దని విద్యార్థులకు సూచించారు. ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించాలన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులకు హెల్మెట్ ధరించాలని చెప్పాలన్నారు. కారులో ప్రయాణించేటప్పుడు సీటు బెల్ట్ పెట్టుకోవాల న్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఎల్లప్పుడూ గుర్తుం చుకోవాలన్నారు. ఎరుపు అంటే ఆగటం, ఆకు పచ్చ అంటే వెళ్లడం, పసుపు అంటే వేగాన్ని తగించడం అన్నారు. వాహనం నడుపుతున్న ప్పుడు మొబైల్ ఫోన్‌ను ఎప్పుడూ ఉపయోగించ వద్దని సూచించారు. మైనర్లు వాహనాలను నడ పవద్దన్నారు. మద్యం తాగి వాహనం నడపవద్ద న్నారు. మద్యం తాగి వాహనం నడపడం ప్రమా దకరమన్నారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి సీఐ సంజీవ్, ఎస్ఐ నాగరాజు, గ్లోబల్ రెయిన్ బో స్కూల్, జీవీఆర్ కళాశాల కరస్పాండెంట్ ఎండీ ఎర్షాద్ అహ్మద్, ప్రిన్సిపాల్ శేఖర్‌రెడ్డి, పాపారావు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

# ఎక్సలెంట్ హైస్కూల్‌లో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం

**ప్రజాపక్షం/పినపాక:** స్థానిక ఎక్సలెంట్ హైస్కూల్‌లో నిర్వహించిన రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమానికి డీఎస్పీ రవీందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన ట్రాఫిక్ సంకేతాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ, కుటుంబ సభ్యులు వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నియమాలు పాటించేలా సహకరించాలని సూచించారు. భవి ష్యత్ తరాలైన విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన అవసరమని తెలిపారు. వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థు లకు బహుమతులు అందజేశారు. సీఐ ఏడూళ్లబయ్యారం వెంకటేశ్వర రావు, ఎక్సలెంట్ స్కూల్ ఛైర్మన్ యూసఫ్, పాఠశాల సిబ్బంది, ఎంఈఓ తదితరుల సమక్షంలో సుమారు 200 మంది విద్యార్థులు ఏడ్లబ య్యారం క్రాస్ రోడ్డులో మానవహారం నిర్వహించి, ట్రాఫిక్ నియ మాలు పాటించాలని ప్రతిజ్ఞ చేశారు.

# సిబిఎస్ఈ ఫలితాల్లో సత్తాచాటిన బ్లూమింగ్ మైండ్స్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** సిబిఎస్ఈ పదవ తరగతి ఫలితాల్లో బ్లూమింగ్ మైండ్స్ సెంట్రల్ స్కూల్, జూనియర్ కళాశాల విద్యార్థులు నూరు శాతం ఫలితాలు సాధించి సత్తా చాటారని పాఠ శాల కరస్పాండెంట్ పి. అశోక్‌రెడ్డి తెలిపారు. బుధవారం ప్రకటించిన ఫలితాలలో పాఠశాలకు చెందిన జి. జయ చందర్ 97.3 శాతం, కె. గుణశ్రీ 94 శాతం, ఎం. దినేష్‌రెడ్డి 93, ఎం. హాసిని చంద్రన్ 93, బి. అర్విత్ నాయక్ 93, ఎన్ఎస్ టి గుప్తా 91, కె. శ్రేష్ట 91, జే. భవిత 90, డి. తన్విన్ 90, కె. శ్రీహరిణి 90, ఎం.కుసుమి 90, డి. హిమబిందు 90, టి. విష్ణుప్రియ 90, అజీమ కౌసర్ 90, ఐ. జివాంతిక 90 శాతం మార్కులు సాధించినట్లు ఆయన తెలిపారు. 80 శాతానికి పైగా మార్కులు 31 మంది విద్యార్థులు, 70 శాతానికి పైగా మార్కులు 39 మంది విద్యార్థులు, 60 శాతానికి పైగా మార్కులు 31 మంది విద్యార్థులు, 50 శాతానికి పైగా మార్కులు ఆరుగురు విద్యార్థులు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఛైర్మన్ భీమిరెడ్డి సత్యనారాయణ, కరస్పాండెంట్ పి. అశోక్‌రెడ్డి అభినం దించారు. ఉత్తమ ఫలితాలకు కృషి చేసిన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్ర మంలో ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# హెచ్ఐవి బాధిత చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ



**ప్రజాపక్షం/ వైద్యవిభాగం :** హెచ్ఐవి బాధిత చిన్నారులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. బుధవారం ఆలయ ఫౌండేషన్, ఆశా పాజిటివ్ పీపుల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కేర్ సపోర్ట్ సెంటర్ కార్యాలయంలో 13 మంది హెచ్ఐవి బాధిత చిన్నారులకు అడిషనల్ డిఎం అండ్‌హెచ్‌వో చందు నాయక్ పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఎయిడ్స్ రహిత జిల్లాగా ఖమ్మంను మార్చడమే లక్ష్యమని తెలిపారు. హెచ్ఐవి వైరస్‌తో జీవిస్తున్న వారికి పౌష్టికాహారం అత్యంత కీలకమన్నారు. సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి పెరిగి వైరస్ అదుపులో ఉంటుందన్నారు. మందులతో పాటు పౌష్టి కాహారం తీసుకుంటే ఆరోగ్యకర జీవితాన్ని గడపవచ్చునని తెలిపారు. హెచ్ఐవి బాధిత చిన్నా రులు చదువు విషయంలో ఎటువంటి ఆందోళన వద్దని వారికి పూర్తి సహకారం అందిస్తామ న్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం మేనేజర్ వెంకటేశ్వర్లు, సత్యకుమార్, రామకృష్ణ, సుందర్, నవీన్, రాము, రవికుమార్, గౌస్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణాపై పోలీసుల కఠిన చర్యలు



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** చంద్రుగొండ మండ లంలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. రేప ల్లెవాడ, గానుగపాడు గ్రామాల మధ్యనున్న ఎదుళ్ల వాగు నుండి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించారు. చంద్రుగొండ ఎస్ఐ శివరామకృష్ణ తన సిబ్బం దితో కలిసి దాడి నిర్వహించి రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై ఇద్దరు డ్రైవర్లపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ శివరామకృష్ణ హెచ్చరించారు.

# హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం

**- మైనర్‌లకు వాహనాలు ఇవ్వకూడదు**



**ప్రజాపక్షం/పాల్వంచ:** హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమని పాల్వంచ గ్రామీణ పోలీస్ సెషన్ ఎస్ఐ.సురేష్ అన్నారు. మండల పరిధి నాగారం హైస్కూల్‌లో బుదవారం విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సంధర్భంగా మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్, ఎస్ఐ. సురేష్‌లు మాట్లాడుతూ విద్యార్థులు తమ పుట్టిన రోజు సంధర్భంగా తల్లిదండ్రులకు రిటర్న్ గిఫ్ట్‌గా హెల్మెట్ ఇవ్వాలని సూచించారు. ప్రమాదాలు జరిగిన సంధర్భంలో మానవ శరీరంలో సున్నితమైన తలకు దెబ్బలు తగిలి చాలా మంది మృతి చెందుతున్నారని చెప్పారు. వీటి నివారణకు వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. అలాగే మైనర్‌లకు వాహనాలు ఇచ్చినచో తల్లిదండ్రులు శిక్ష అనుభవించాల్సి వస్తుందని హెచ్చరించారు. వేసవి కాలంలో విద్యార్థులు వాగులు, చెరువుల లోకి ఈతకువెళ్ళి ప్రమాదాలు కొనితెచ్చుకోవద్దని, తమ తల్లిదండ్రులకు క్షోభ పెట్టొద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ బొగ్గా నారాయణ, ఎంపిఓ చెన్న కేశవులు, సర్పంచ్ స్వప్న, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. బాలయ్య, ఏపిఓ పోరండ్ల రంగా, కార్యదర్శి దుర్గా రావు, వార్డు మెంబర్‌లు తదితరులు పాల్గొన్నారు.

# అశ్వాపురంలో విద్యార్థుల మానవహారం



**ప్రజాపక్షం/అశ్వాపురం:** రోడ్డు భద్రత దినోత్సవం సందర్భంగా పీఎం శ్రీ జెడ్‌పిహెచ్ఎస్ అశ్వాపురం విద్యార్థులు అంబేద్కర్ సెంటర్‌లో మానవహారం , ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా సర్పంచ్ సదర్ లాల్ రోడ్డు నియ మాలు పాటించాలని, మద్యం సేవించి డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా ప్రయాణం ప్రమాదకరమని హెచ్చరించారు. అనంతరం ప్రధానోపాధ్యాయురాలు యోగితా వేణి తల్లిదండ్రులు హెల్మెట్ ధరించాలని, లైసెన్స్ లేకుండా పిల్లలు వాహనాలు నడపరాదని సూచించారు. ఉపాధ్యాయులు హెచ్ శ్రీను విద్యార్థులతో రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీస్ శాఖ, పంచాయితీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.